# శుభోదయం

ప్రతీ అక్షరం..ప్రజా సమరం......!

WWW.SUBHODAYAMDAILY.COM

అమరావతి,హైదరాబాద్, సంపుటి : 02, సంచిక : 57, పేజీలు : 08, ఎడిటర్ : వి. శ్రీనివాసరావు (6281773157) గురువారం -15 - మే - 2025

## భూమికి అదే డెడ్ లైన్... జపాన్ పరిశోధకుల అధ్యయనం

### మరో 100 కోట్ల సంవత్సరాల్లో భూమిపై ఆక్సిజన్ మాయం




న్యూఢిల్లీ :భూగోళం భవిష్యత్తుపై జపాన్‌లోని టోహో విశ్వవిద్యాలయ పరిశోధకులు ఆందోళనకరమైన విషయాలను వెల్లడించారు. సుమారు ఒక బిలియన్ (వంద కోట్ల) సంవత్సరాల తరువాత భూమిపై ప్రాణవాయువు అదృశ్యమవుతుందని, తద్వారా ప్రస్తుతం ఉన్న జీవరాశి మనుగడ అసాధ్యంగా మారుతుందని తమ అధ్యయనంలో తేల్చారు. నాసా కు చెందిన గ్రహ నమూనాలను ఉపయోగించి చేసిన ఈ పరిశోధన వివరాలు ప్రఖ్యాత సైంటిఫిక్ జర్నల్ 'నేచర్ జియోసైన్స్' లో 'ది ఫ్యూచర్ లైఫ్‌స్పాన్ ఆఫ్ ఎర్త్స్ ఆక్సిజనరేటెడ్ అట్మాస్ఫియర్' (భూమి ఆక్సిజన్ సహిత వాతావరణ భవిష్య జీవితకాలం) పేరుతో

## భారత రక్షణ రంగ ఎగుమతుల్లో రికార్డు స్థాయి పెరుగుదల



మేక్ ఇన్ ఇండియా' సత్తా... రక్షణ ఎగుమతుల్లో కొత్త శిఖరాలు

భారత్ రక్షణ ఎగుమతుల్లో 34 రెట్ల వృద్ధి

2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.23,622 కోట్ల ఎగుమతులు

2013-14లో కేవలం రూ.686 కోట్లుగా ఉన్న ఎగుమతులు

2లో

## మహారాష్ట్ర-తెలంగాణ సరిహద్దుల్లో పులి భయం..

### నాలుగు రోజుల్లో ఐదుగురిని చంపిన పెద్దపులి



- మహారాష్ట్రలో ఐదుగురిని చంపిన పులి
- మహారాష్ట్ర-తెలంగాణ సరిహద్దులో పులి దాడులతో తీవ్ర భయాందోళన
- తెలంగాణలోని కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రజల్లోనూ ఆందోళన
- తునికాకు సేకరణపై ప్రభావిత ప్రాంతాల్లో తాత్కాలిక నిషేధం

## సీఐపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆగ్రహం




హైడ్రా కార్యాలయంలో ప్రజావాణి

హయత్ నగర్ సీఐపై హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆగ్రహం వ్యక్తం

బాధితుల ఫిర్యాదులపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేయాలని సూచించారు.

# నేను నిత్య విద్యార్థిని

## కొత్త విషయాలు నేర్చుకుంటూనే ఉంటా

- ప్రపంచం మొత్తం జీఎఫ్ఎస్‌టి గురించి చెప్పుకోవాలి
- 1995 నుంచి నేర్చుకుంటూనే ఉన్నా
- జీఎఫ్ఎస్‌టి సంస్థ 6 ఏళ్ల క్రితం ప్రారంభించాం
- ఆర్థిక సంస్కరణల వలన దేశం అభివృద్ధి చెందింది
- ప్రపంచంలో ఎక్కడికి వెళ్లినా భారతీయులు ఉన్నారని, వారిలో తెలుగు వాళ్లే అధికమం

విజయవాడ: విజయవాడలో పశు సంవర్ధక శాఖ టెక్ ఏఐ 2.0 కాంక్లేవ్‌లో సీఎం చంద్రబాబు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఆయన మాట్లాడుతూ.. నేను నిత్య విద్యార్థిని, ఎప్పుడూ కొత్త విషయాలు నేర్చుకుంటూనే ఉంటా. 1995 నుంచి నేర్చుకుంటూనే ఉన్నా. జీఎఫ్ఎస్‌టి సంస్థ 6 ఏళ్ల క్రితం ప్రారంభించాం. ఆర్థిక సంస్కరణల వలన దేశం అభివృద్ధి చెందింది. అప్పుడు ఫ్యామిలీ ప్లానింగ్ అని అన్నా..ఇప్పుడు పిల్లలు ఎక్కువ మంది కనాలి అంటున్నా.. ఎంట్రపెన్యూర్ ను ప్రోత్సహించాను. ప్రపంచం మొత్తం జీఎఫ్ఎస్‌టి గురించి చెప్పుకోవాలి...అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. సాంకేతికత ప్రతి ఒక్కరికి అందుబాటులో ఉందని చెప్పారు. ప్రపంచంలో ఎక్కడికి వెళ్లినా భారతీయులు ఉన్నారని, వారిలో తెలుగు వాళ్లే అధికమన్నారు. ప్రపంచంలో యువత ఎక్కువగా ఉండేది భారత్ లోనే నని చెప్పారు. గతంలో ఏ పని చేయాలన్న



ప్రభుత్వం మిగతా.. 2లో

## హైదరాబాద్‌లో మాజీ సీఎం కొణిజేటి రోశయ్య కాంస్య విగ్రహం!




లక్డీకపూల్ మెట్రో స్టేషన్ సమీపంలో ప్రతిష్ఠాపనకు నిర్ణయం

టెండర్లను ఆహ్వానించిన జీహెచ్ఎంసీ

తొమ్మిది అడుగుల విగ్రహం,

జూలై 4న ఆవిష్కరణకు యోచన




## ఈ నెల 25న ప్రధాని మోదీ కీలక సమావేశం ..

### ఢిల్లీకి చంద్రబాబు, పవన్

ప్రధాని మోదీ అధ్యక్షతన ఈ నెల 24 ఎన్డీఏ కీలక భేటీ

ఆపరేషన్ సిందూర్, తదనంతర పరిణామాలపై చర్చించే అవకాశం

## 'త్వరలోనే తెలంగాణ సీఎం మార్పు.. రేవంత్ స్థానంలో కేసీఆర్'




## ప్రధాని మోదీ నివాసంలో కీలక సమావేశం

ప్రధాని నరేంద్ర మోదీ నివాసంలో హైలెవిల్ సీసీఎస్ సమావేశం

భారత్-పాక్‌లు కాల్పుల విరమణకు అంగీకారం తెలిపిన తర్వాత సీసీఎస్‌తో ప్రధాని మోదీ భేటీ కావడం తొలిసారి.

ఆపరేషన్ సిందూర్ తో పాకిస్తాన్ కు గట్టిగా బుద్ధి చెప్పారని మోదీని అభినందించింది




## కల్నల్ సోఫియా ఖురేషీపై బీజేపీ మంత్రి వ్యాఖ్యలు... షర్మిల ఫైర్

- ఆపరేషన్ సిందూర్ తో ఎంతో ఫేమస్ అయిన కల్నల్ సోఫియా ఖురేషీ
- సోఫియా ఖురేషీపై తీవ్ర వ్యాఖ్యలు చేసిన మధ్యప్రదేశ్ మంత్రి కున్వర్ విజయ్ షా
- ఇవి ఆయన నోరు జారిన మాటలు కావన్న షర్మిల
- బీజేపీ మనస్తత్వంలో పేరుకుపోయిన కుళ్లుకు నిదర్శనమని విమర్శలు




అమరావతి : ఆపరేషన్ సిందూర్ లో ఎంతో కీలకంగా వ్యవహరించిన కల్నల్ సోఫియా ఖురేషీని ఉద్దేశించి మధ్యప్రదేశ్ మంత్రి, బీజేపీ నేత కున్వర్ విజయ్ షా చేసిన మతపరమైన, లైంగిక వివక్షాపూరిత వ్యాఖ్యలు అత్యంత అవమానకరమని,

## ఏపీ లిక్కర్ కేసులో కీలక పరిణామం..

### సిట్ విచారణకు హాజరైన ధనుంజయ్ రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డి



ఏపీ లిక్కర్ స్కాంలో సిట్ దర్యాప్తు ముమ్మరం

సుప్రీంకోర్టు ఆదేశాలతో సిట్ ముందుకు వచ్చిన ధనుంజయ్ రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డి

ప్రశ్నిస్తున్న సిట్ అధికారులు

## పెద్దిరెడ్డి భూ కబ్జాలపై విజిలెన్స్ డీజీ నివేదిక

- పెద్దిరెడ్డి, ఆయన కుటుంబ సభ్యులపై కేసులకు పవన్ ఆదేశం
- ఆక్రమణలకు సహకరించిన అధికారుల పైనా శాఖాపరమైన చర్యలు తీసుకోవాలన్న డిప్యూటీ సీఎం
- ప్రభుత్వ భూముల పరిరక్షణకు ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలన్న డిప్యూటీ సీఎం




అమరావతి : చిత్తూరు జిల్లాలో అటవీ భూముల ఆక్రమణలకు పాల్పడ్డారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆయన కుటుంబ సభ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, అటవీ, పర్యావరణ శాఖల మంత్రి పవన్ కల్యాణ్ సంబంధిత అధికారులను ఆదేశించారు.

## దేశంలోనే అతిపెద్ద ఇంటిగ్రేటెడ్ ప్రాజెక్టుకు

# 16న మంత్రి లోకేశ్ శంకుస్థాపన

- రూ. 22వేల కోట్లతో అనంతపురం జిల్లాలో రెన్యూ ఎనర్జీ కాంప్లెక్స్
- ప్రజాప్రభుత్వంలో పెద్దఎత్తున తరలివస్తున్న పునరుత్పాదక ఇంధన పరిశ్రమలు
- ఆరేళ్ల తర్వాత రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చిన రెన్యూ పవర్
- రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక పునరుత్పాదక ఇంధన రంగం మళ్లీ పట్టాలెక్కింది.




అమరావతి :రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో ప్రజాప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ తో పెద్దఎత్తున పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులు ఏపీకి క్యూకడుతున్నాయి. ఇందులో భాగంగా అనంతపురం జిల్లా గుంతకల్లు నియోజకవర్గం బేతపల్లిలో రెన్యూ సంస్థ రూ. 22వేల కోట్లతో భారతదేశంలోనే అతిపెద్ద ఇంటిగ్రేటెడ్ రెన్యువబుల్ పవర్ కాంప్లెక్స్ ఏర్పాటు చేయనుంది. ఈ నెల 16వ తేదీన రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ ఈ భారీ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయనున్నారు. దావోస్ వరల్డ్ ఎకనమిక్ ఫోరం సదస్సులో

## భూమికి అదే డెడ్ లైన్... జపాన్ పరిశోధకుల అధ్యయనం

న్యూఢిల్లీ :భూగోళం భవిష్యత్తుపై జపాన్‌లోని టోహో విశ్వవిద్యాలయ పరిశోధకులు ఆందోళనకరమైన విషయాలను వెల్లడించారు. సుమారు ఒక బిలియన్ (వంద కోట్ల) సంవత్సరాల తరువాత భూమిపై ప్రాణవాయువు అదృశ్యమవుతుందని, తద్వారా ప్రస్తుతం ఉన్న జీవరాశి మనుగడ అసాధ్యంగా మారుతుందని తమ అధ్యయనంలో తేల్చారు. నాసా కు చెందిన గ్రహ నమూనాలను ఉపయోగించి చేసిన ఈ పరిశోధన వివరాలు ప్రఖ్యాత సైంటిఫిక్ జర్నల్ 'నేచర్ జియోసైన్స్' లో 'ది ఫ్యూచర్ లైఫ్‌స్పాన్ ఆఫ్ ఎర్త్స్ ఆక్సిజనరేటెడ్ అట్మాస్ఫియర్' (భూమి ఆక్సిజన్ సహిత వాతావరణ భవిష్య జీవితకాలం) పేరుతో ప్రచురితమయ్యాయి. టోక్యోలోని టోహో విశ్వవిద్యాలయంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న కజుమి ఒజాకి నేతృత్వంలోని శాస్త్రవేత్తల బృందం, సూర్యుడి వయసు పెరిగే కొద్దీ భూ వాతావరణంలో సంభవించే మార్పులను అంచనా వేయడానికి సుమారు 400,000 అనుకరణలు (సిమ్యులేషన్లు) నిర్వహించింది. ఈ విశ్లేషణ ద్వారా భూమిపై ఆక్సిజన్ స్థాయిలు గణనీయంగా పడిపోయే సమయం గురించి ఒక అంచనాకు వచ్చారు.

ఆక్సిజన్ క్షీణతకు కారణాలు:

ఈ అధ్యయనం ప్రకారం, సూర్యుడు వయసు పైబడే కొద్దీ క్రమంగా మరింత వేడిగా, ప్రకాశవంతంగా మారతాడు. ఈ సౌర వికిరణం పెరుగుదల భూమి వాతావరణంపై తీవ్ర ప్రభావం చూపుతుంది, ఇది పలు మార్పులకు దారితీస్తుంది:

నీరు ఆవిరైపోవడం: పెరిగిన ఉష్ణోగ్రతల కారణంగా భూమిపై ఉన్న జలాశయాల నుండి నీరు వేగంగా ఆవిరై, వాతావరణంలో నీటి ఆవిరి స్థాయిలు పెరుగుతాయి.

ఉష్ణోగ్రతల పెరుగుదల: భూ ఉపరితల ఉష్ణోగ్రతలు పెరిగి, జీవరాశి మనుగడకు ప్రతికూల పరిస్థితులు ఏర్పడతాయి. కార్బన్ చక్రానికి అంతరాయం: అధిక వేడి కార్బన్ చక్రాన్ని బలహీనపరుస్తుంది. వాతావరణంలోని కార్బన్ డయాక్సైడ్ ను నియంత్రించడంలో ఈ చక్రం కీలక పాత్ర పోషిస్తుంది. మొక్కలు నశించడం: కార్బన్ చక్రం దెబ్బతినడంతో, కిరణజన్య సంయోగక్రియ ద్వారా ఆక్సిజన్‌ను ఉత్పత్తి చేసే మొక్కలు నశించిపోతాయి, ఫలితంగా ఆక్సిజన్ ఉత్పత్తి నిలిచిపోతుంది.

వాతావరణంలో మార్పులు:

కార్బన్ చక్రం క్షీణించిన తరువాత, భూ వాతావరణం అధిక మీథేన్, తక్కువ ఆక్సిజన్‌తో కూడిన ఆదిమ కాలం నాటి భూమి స్థితికి చేరుకుంటుందని పరిశోధన వెల్లడించింది. కిరణజన్య సంయోగక్రియ చేసే జీవుల విస్తరణ కారణంగా భూమి వాతావరణం ఆక్సిజన్‌తో సమృద్ధిగా మారిన 'గ్రేట్ ఆక్సిడేషన్ ఈవెంట్'కు ముందున్న పరిస్థితులను ఇది పోలి ఉంటుంది. ఒక కీలక దశకు చేరుకున్న తర్వాత, కొన్ని వేల సంవత్సరాల వ్యవధిలోనే భూమిపై ఆక్సిజన్ వేగంగా క్షీణిస్తుందని సిమ్యులేషన్లు అంచనా వేస్తున్నాయి. ఆక్సిజన్ తగ్గడంతో పాటు మీథేన్ వాయువు స్థాయిలు గణనీయంగా పెరుగుతాయి. ఇలాంటి పరిస్థితుల్లో మానవులతో సహా సంక్లిష్టమైన ఏరోబిక్ (ఆక్సిజన్‌పై ఆధారపడే) జీవులు మనుగడ సాగించడం అసాధ్యమని శాస్త్రవేత్తలు తెలిపారు. గతంలో కొన్ని శాస్త్రీయ నమూనాలు, భూమిపై జీవరాశి మరో రెండు బిలియన్ సంవత్సరాల వరకు మనుగడ సాగిస్తుందని అంచనా వేశాయి. అయితే, ఈ నూతన అధ్యయనం ఆక్సిజన్ ఉత్పత్తి అంతమయ్యే సమయాన్ని మరింత ముందుకు తెచ్చింది. భూమిపై జీవరాశి అంతిమ వినాశం గురించి తెలిసినప్పటికీ, ఆక్సిజన్ క్షీణత ఎప్పుడు, ఎలా జరుగుతుందనే కచ్చితమైన వివరాలు ఇప్పటివరకు అస్పష్టంగానే ఉన్నాయని కజుమి ఒజాకి నొక్కిచెప్పారు. ఈ తాజా పరిశోధన, అధునాతన సూపర్ కంప్యూటర్ సిమ్యులేషన్ల ద్వారా స్పష్టమైన అవగాహన కల్పిస్తోందని ఆయన వివరించారు.

## భారత రక్షణ రంగ ఎగుమతుల్లో రికార్డు స్థాయి పెరుగుదల

న్యూఢిల్లీ : భారత రక్షణ రంగం 'ఆత్మనిర్భర్ భారత్' స్ఫూర్తితో అద్భుత ప్రగతి సాధిస్తోంది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో దేశ రక్షణ ఎగుమతులు రూ.23,622 కోట్లకు (సుమారు %2.76 బిలియన్లు) చేరి చారిత్రక రికార్డు సృష్టించాయి. ఇది దేశ రక్షణ చరిత్రలోనే అత్యధికం కావడం గమనార్హం. గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో రూ.21,083 కోట్లుగా ఉన్న ఎగుమతులు, ఈ ఏడాది 12.04% వృద్ధిని నమోదు చేశాయి. 2013-14లో కేవలం రూ.686 కోట్లుగా ఉన్న ఎగుమతులు ఇప్పుడు ఏకంగా 34 రెట్లు పెరగడం 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమ పటిష్టతకు నిదర్శనమని రక్షణ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ప్రస్తుతం భారత్ సుమారు 80 దేశాలకు రక్షణ ఉత్పత్తులను ఎగుమతి చేస్తుండగా... 2029 నాటికి ఈ ఎగుమతులను రూ.50,000 కోట్లకు చేర్చాలని రక్షణ మంత్రిత్వ శాఖ లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఇటీవల జరిగిన 'ఆపరేషన్ సిందూర్' భారత ఆయుధ వ్యవస్థల నాణ్యతను, సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటిందని నిపుణులు విశ్లేషిస్తున్నారు కాగా, రక్షణ రంగ ఎగుమతుల్లో ప్రైవేటు సంస్థల వాటా రూ.15,233 కోట్లు కాగా, ప్రభుత్వ రంగ సంస్థలు రూ.8,389 కోట్ల విలువైన ఉత్పత్తులను అందించాయి. ముఖ్యంగా డిపిఎస్‌యూ ల ఎగుమతి పనితీరు గత ఏడాదితో పోలిస్తే 42.85% పెరగడం భారత రక్షణ ఉత్పత్తులకు అంతర్జాతీయంగా పెరుగుతున్న ఆమోదాన్ని సూచిస్తోంది. దేశీయ తయారీని ప్రోత్సహించడానికి ప్రభుత్వం విధానపరమైన సరళీకరణలు, ఆన్‌లైన్ అనుమతి వేదికలు వంటి అనేక చర్యలు చేపట్టింది. మందుగుండు సామగ్రి, ఆయుధాలు, విడిభాగాలు వంటి అనేక రకాల సైనిక పరికరాలను భారత్ విజయవంతంగా ఎగుమతి చేస్తోంది. ఈ గణనీయమైన వృద్ధి, దిగుమతులపై ఆధారపడే స్థాయి నుంచి రక్షణ ఉత్పత్తుల తయారీదారుగా, ఎగుమతిదారుగా భారత్ రూపాంతరం చెందుతోందనడానికి నిదర్శనం.

## మహారాష్ట్ర-తెలంగాణ సరిహద్దుల్లో పులి భయం..
## నాలుగు రోజుల్లో ఐదుగురిని చంపిన పెద్దపులి

హైదరాబాద్: మహారాష్ట్ర-తెలంగాణ సరిహద్దు ప్రాంతాలు పులి భయంతో వణికిపోతున్నాయి. ఓ పెద్ద పులి మహారాష్ట్రలోని చంద్రపూర్ జిల్లాలో కేవలం నాలుగు రోజుల వ్యవధిలో ఐదుగురిని బలితీసుకోవడంతో తీవ్ర కలకలం రేగింది. ఈ జిల్లా తెలంగాణలోని కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాకు ఆనుకుని ఉండటంతో, ఆ పులి తమ ప్రాంతంలోని అడవుల్లోకి ప్రవేశిస్తుందేమోనని అక్కడి ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. సోమవారం నాడు మూల్ తాలూకాలోని బదురానా గ్రామానికి చెందిన భూమికా బెండేర్ (28) అనే మహిళ పులి దాడిలో మరణించడం ఈ భయాలను మరింత తీవ్రతరం చేసింది. తన భర్త, కుటుంబ సభ్యులతో కలిసి అటవీ ఫలసాయమైన తునికాకు సేకరణకు వెళ్లినప్పుడు ఈ ఘోరం జరిగింది. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం, వారు ఆకు సేకరిస్తుండగా పులి అకస్మాత్తుగా దాడి చేసింది. తప్పించుకునేందుకు ప్రయత్నించినప్పటికీ, భూమికా పులి పంజాకు చిక్కి ప్రాణాలు కోల్పోయింది. సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారులు ఘటనా స్థలాన్ని పరిశీలించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మూల్ పట్టణానికి తరలించారు. ఈ పులి సాగిస్తున్న మారణకాండ మే 10వ తేదీన ప్రారంభమైంది. మెండమాలా గ్రామానికి చెందిన కాంత చౌదరి (65), శుభాంగి చౌదరి (28), రేఖాషిండే (51) అనే ముగ్గురు కూలీలు తునికాకు సేకరణకు వెళ్లి, చర్గావ్ అటవీ ప్రాంతంలోని ఓ చెరువు సమీపంలో విగతజీవులుగా కన్పించారు. ఆ మరుసటి రోజే, నాగోడా గ్రామానికి చెందిన విమలా షిండే (64) మరో దాడిలో పులికి బలయ్యారు. ఈ వరుస ఘటనలతో చంద్రపూర్, బల్లార్షా జిల్లాలతో పాటు తెలంగాణలోని కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా వాసులు కూడా తీవ్ర భయాందోళన చెందుతున్నారు.

అటవీశాఖ చర్యలు

ఈ దాడుల నేపథ్యంలో మహారాష్ట్ర అటవీశాఖ అధికారులు ప్రభావిత ప్రాంతాల్లో తునికాకు సేకరణను తాత్కాలికంగా నిషేధించారు. ప్రజల భద్రత దృష్ట్యా ఈ నిర్ణయం అవసరమని భావించినప్పటికీ, ఇది అటవీ ఉత్పత్తులపై ఆధారపడి జీవించే గిరిజనుల సీజనల్ ఆదాయంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. పులిని గుర్తించి, బంధించే వరకు అటవీ ప్రాంతాల్లోకి వెళ్లవద్దని అధికారులు స్థానికులకు విజ్ఞప్తి చేశారు. పులి జాడ కనిపెట్టేందుకు అదనపు సిబ్బందిని మోహరించి, గాలింపు చర్యలను ముమ్మరం చేశారు. ఆవాసం కోల్పోవడం లేదా గాయపడటం వల్ల పులి ఈ విధంగా దూకుడుగా ప్రవర్తిస్తుండవచ్చని వన్యప్రాణి నిపుణులు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. ఈ దాడుల ఘటన అటవీ సరిహద్దు గ్రామాల్లో మానవ-వన్యప్రాణి సంఘర్షణ సమస్యను మరోసారి తెరపైకి తెచ్చింది. అటవీ ఉత్పత్తులపై ఆధారపడే గిరిజన కార్మికులకు మెరుగైన రక్షణ కల్పించాలని, పర్యవేక్షణను పటిష్టం చేయాలని, ముందస్తు హెచ్చరిక వ్యవస్థలను ఏర్పాటు చేయాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

## సీఐపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆగ్రహం

హైదరాబాద్: బాధితులు ఫిర్యాదు చేసినా కేసులు ఎందుకు నమోదు చేయలేదని హయత్ నగర్ సీఐపై హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ ప్లాట్లను కబ్జా చేశారని పలువురు బాధితులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదుతో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ స్వయంగా కోహెడలో వివాదాస్పద స్థలాన్ని పరిశీలించారు. భూమిలో మారణాయుధాలు చూసి ఆ?గ్రహానికి లోనయ్యారు.ఈ సందర్భంగా..బాధితులపై దాడి జరిగినా కేసు ఎందుకు నమోదు చేయలేదని హయత్ నగర్ సీఐపై హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధితులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. బాధితుల ఫిర్యాదులపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేయాలని సూచించారు. వారికి న్యాయం చేయాలని ఆదేశాలు జారీ చేశారు.

హైడ్రా కార్యాలయంలో ప్రజావాణి

హైదరాబాద్ హైడ్రా కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తోంది. ప్రతి సోమవారం ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించేలా హైడ్రా ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈ ప్రజావాణి కార్యక్రమానికి విశేష స్పందన వస్తోంది. బాధితుల నుంచి హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఫిర్యాదులను స్వయంగా స్వీకరిస్తున్నారు. అందిన ఫిర్యాదులపై విచారణ చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్నారు.అయితే,ప్రజా వాణిలో కోహెడలో తమ భూమి కబ్జాకు గురైందని, ఫిర్యాదు చేసినా హయత్ నగర్ సీఐ పట్టించుకోవడం లేదంటూ ఏవీ రంగనాథ్ ఎదుట ఏకరవు పెట్టుకున్నారు. దీంతో బాధితుల ఫిర్యాదు మేరకు ఏవీ రంగనాథ్ స్వయంగా వివాదాస్పద స్థలాన్ని సందర్శించారు. బాధితులతో మాట్లాడారు.

## ఈ నెల 25న ప్రధాని మోదీ కీలక సమావేశం ..
## ఢిల్లీకి చంద్రబాబు, పవన్

న్యూఢిల్లీ: ఆపరేషన్ సిందూర్‌తో దాయాదికి చుక్కలు చూపించిన తర్వాత ఎన్డీఏ కీలక భేటీ కానుంది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన ఈ నెల 25న సమావేశం జరగనుంది. ఎన్డీఏ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఉప ముఖ్యమంత్రులు సైతం ఈ సమావేశానికి హాజరుకానున్నారు. ఈ సమావేశంలో ఆపరేషన్ సిందూర్ చేపట్టడానికి గల ముఖ్య ఉద్దేశాన్ని ఎన్డీఏ నేతలకు వివరించనున్నట్లు సమాచారం. ఆపరేషన్‌లో ఉగ్రవాద శిబిరాలపై చేసిన దాడుల గురించి వివరించే అవకాశం ఉంది. పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా ఎన్డీఏ ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌కు దేశ వ్యాప్తంగా రాజకీయ పార్టీలు, ప్రజల నుంచి ప్రశంసలు లభించాయి. ప్రతిపక్ష నేతలు సైతం ప్రధాని తీసుకున్న నిర్ణయాన్ని ప్రశంసించారు. అయితే భారత ప్రభుత్వం కాల్పుల విరమణకు అంగీకరించడంతో ఎన్డీఏ ప్రభుత్వంపై విపక్షాల నుంచి విమర్శలు ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో ఆపరేషన్ సిందూర్, అనంతర పరిణామాలపై ఎన్డీఏ నేతలకు అవగాహన కల్పించడం ద్వారా విమర్శలను తిప్పికొట్టేలా చేయాలని ప్రభుత్వ పెద్దలు భావిస్తున్నట్లు సమాచారం. ఈ క్రమంలోనే ఎన్డీఏ కీలక భేటీ జరగనుంది. ఉగ్రవాదులపై ప్రతీకారం తీర్చుకునేందుకు ఆపరేషన్ సిందూర్ కొనసాగుతుందని మరోసారి స్పష్టం చేయనున్నారు. ఈ కీలక భేటీకి ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హాజరుకానున్నట్లు సమాచారం.

# నేను నిత్య విద్యార్థిని కొత్త విషయాలు నేర్చుకుంటూనే ఉంటా

మొదటి పేజి తరువాయి




గతంలో ఏ పని చేయాలన్న ప్రభుత్వం అనుమతి అవసరమన్నారు. 1991లో ఆర్థిక సంస్కరణలు రాగానే మార్పులు వచ్చాయని తెలిపారు. అప్పుడప్పుడే వస్తున్న ఐటీని సద్వినియోగం తీసుకున్నామని తెలిపారు. అప్పుడే వచ్చిన ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో ఏ పనులైన సులువుగా చేసుకుని పరిస్థితి వచ్చిందని తెలిపారు. పేదరికం లేని సమాజమే లక్ష్యం పేదరికం లేని సమాజమే లక్ష్యంగా పనిచేస్తున్నామని సీఎం చంద్రబాబు తెలిపారు. సంపద సృష్టించాలి.. ప్రజలకు అందించాలి అనేది తన ధ్యేయమన్నారు. ఇష్టపడి పని చేస్తే కష్టం ఉండదని తెలిపారు. వాట్సాప్ గవర్నెన్స్ లో ఇప్పటికే 330 సర్వీసులు ఇస్తున్నామని, మరి కొద్ది రోజుల్లో 400కు పెంచుతామని వెల్లడించారు రెండు మూడు నెలల్లో వాట్సప్ గవర్నన్స్?పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకొస్తామని తెలిపారు. ప్రతి కుటుంబం నుంచి ఒక పారిశ్రామికవేత్త ఎదగాలని పిలుపునిచ్చారు. అందుకే రతన్ టాటా ఇన్నోవేషన్ సెంటర్ ను ఏర్పాటు చేశామని తెలిపారు. దేశంలో మైక్రో ఇరిగేషన్ కు ఆంధ్రప్రదేశ్ చిరునామా కావాలని ఆకాంక్షించారు. సాంకేతిక యుగంలో సమర్థత పెంచుకోవాలని చంద్రబాబు సూచించారు.

"ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో ఏ పనైనా సులువుగా చేసుకునే పరిస్థితి వచ్చింది. గతంలో ఎక్కడ చూసినా రహదారులు గుంతలతో కనిపించేవి. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో రోడ్లను చక్కగా నిర్మించారు. ఇప్పుడు ఎక్కడ చూసినా జాతీయ రహదారుల అభివృద్ధి జరుగుతోంది. సంపద సృష్టించాలి.. ప్రజలకు అందించాలి. పేదరికం లేని సమాజమే లక్ష్యంగా పెట్టుకున్నాం. రైతుల ఆదాయం రెట్టింపు చేస్తున్నాం. నేను ఎప్పుడూ విద్యార్థిగానే ఉంటా.. అనునిత్యం కొత్త విషయాలు తెలుసుకుంటా. సాంకేతికత ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉంది. సాంకేతిక యుగంలో సమర్థత పెంచుకోవాలి. ప్రపంచంలో ఎక్కడికి వెళ్లినా భారతీయులు ఉన్నారు.. అందులో తెలుగువాళ్లే అధికం. నా ఆలోచన ఒకటే. మనం బాగుంటేనే చాలదు.. తిరిగి సమాజానికి ఇవ్వాలి" అని చంద్రబాబు అన్నారు.

# రూ. 22వేల కోట్లతో అనంతపురం జిల్లాలో రెన్యూ ఎనర్జీ కాంప్లెక్స్

మొదటి పేజి తరువాయి



దావోస్ వరల్డ్ ఎకనమిక్ ఫోరం సదస్సులో మంత్రి లోకేశ్, రెన్యూ ఛైర్మన్ సుమంత్ సిన్హా నడుమ జరిగిన వ్యూహాత్మక చర్చలు ఫలించడంతో ఆరేళ్ల తర్వాత రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు రెన్యూ పవర్ ముందుకు వచ్చింది. రెన్యూ ఇంటిగ్రేటెడ్ ప్రాజెక్టు భారతదేశంలోనే అతిపెద్ద పునరుత్పాదక ఇంధన పెట్టుబడులలో ఒకటిగా నిలవనుంది. ఈ ప్రాజెక్టు తొలిదశలో రెన్యూ సంస్థ 587 మెగావాట్ల సోలార్, 250 మెగావాట్ల విండ్, 415 మెగావాట్ల సామర్థ్యం గల బ్యాటరీ స్టోరేజి యూనిట్లపై రూ.7 వేల కోట్ల పెట్టుబడి పెట్టనుంది. వివిధ దశల్లో 1800 మెగావాట్ల సోలార్, 1 గిగావాట్ విండ్, 2000 మెగావాట్ల సామర్థ్యం గల బ్యాటరీ స్టోరేజి యూనిట్లపై మొత్తంగా రూ. 22 వేల కోట్ల పెట్టుబడి పెట్టనుంది. ఈ ప్రాజెక్టు దేశంలోనే అతిపెద్ద రెన్యువబుల్ పవర్ కాంప్లెక్స్ గా ఆవిర్భవించడమే గాక ఏపీ క్లీన్ ఎనర్జీ కెపాసిటీ, గ్రిడ్ సామర్థ్యాన్ని గణనీయంగా పెంచుతుంది. 2019కి ముందు 777 మెగావాట్ల సామర్థ్యంతో ఏపీ పునరుత్పాదక ఇంధనరంగంలో ప్రధాన పెట్టుబడిదారుగా ఉన్న రెన్యూ... ఆ తర్వాత జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వ అరాచక విధానాలతో పెట్టుబడులు పెట్టడం ఆపేసింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక పునరుత్పాదక ఇంధన రంగం మళ్లీ పట్టాలెక్కింది. గతేడాది అక్టోబర్ లో క్లీన్ ఎనర్జీ పాలసీని ప్రభుత్వం విడుదల చేసింది. చంద్రబాబు ప్రభుత్వం అనుసరిస్తున్న ఇండస్ట్రీ ఫ్రెండ్లీ విధానాలు, పెట్టుబడిదారులకు అనుకూలమైన వాతావరణం, రెన్యూవబుల్ ఎనర్జీ పరిశ్రమలకు అందిస్తున్న ప్రోత్సాహకాలను దావోస్ చర్చల్లో మంత్రి లోకేశ్ రెన్యూ పవర్ ఛైర్మన్‌కు వివరించారు. పరిశ్రమల ఏర్పాటుకు ఫాస్ట్-ట్రాక్ అనుమతులు, ఆకర్షణీయమైన ప్రోత్సాహకాలు పునరుత్పాదక ఇంధనరంగంలో పెద్దఎత్తున పెట్టుబడులకు మార్గం సుగమం చేయడమేగాక పెట్టుబడిదారుల్లో విశ్వాసాన్ని నింపాయి. దీంతో పునరుత్పాదక ఇంధనరంగంలో పెట్టుబడుల ప్రవాహం మొదలైంది. వచ్చే ఐదేళ్లలో 72 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులు రాష్ట్రానికి తీసుకురావడం లక్ష్యంగా పెట్టుకున్న మంత్రి లోకేశ్ ఇప్పటికే పలు కంపెనీలతో చర్చలు జరిపి రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఒప్పించారు. రాష్ట్రవ్యాప్తంగా రూ. 65వేల కోట్లతో 500 సీబీజీ ప్లాంట్ల ఏర్పాటుకు రిలయన్స్ సంస్థ ముందుకు రాగా, కనిగిరిలో తొలిప్లాంట్ కు మంత్రి లోకేశ్ ఇటీవల భూమిపూజ చేశారు. టాటా పవర్ (7వేల మెగావాట్లు, రూ.49వేల కోట్ల పెట్టుబడి), ఎన్టీపీసీ గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టు (రూ.1.86 లక్షల కోట్లు), వేదాంత అనుబంధ సంస్థ సెరెంటికా (10వేల మెగావాట్లు, రూ. 50వేల కోట్లు), ఎస్ఎఈఎల్ ఇండస్ట్రీస్ (1200 మెగావాట్లు, 6వేలకోట్ల పెట్టుబడులు), బ్రూక్ ఫీల్డ్ (8వేల మెగావాట్లు, రూ.50వేలకోట్ల పెట్టుబడి) తదితర ప్రఖ్యాత సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చాయి. రాబోయే రోజుల్లో గ్రీన్ ఎనర్జీ రంగంలో పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్ గమ్యస్థానంగా నిలవనుంది.

## ప్రధాని మోదీ నివాసంలో కీలక సమావేశం

న్యూఢిల్లీ: ఆపరేషన్ సిందూర్ లో భాగంగా న్యూఢిల్లీలోని ప్రధాని నరేంద్ర మోదీ నివాసంలో హైలెవిల్ సీసీఎస్ సమావేశం జరిగింది. పలువురు కీలక కేబినెట్ మంత్రులతో ఈ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, హోంమంత్రి అమిత్ షాలు హాజరయ్యారు. పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత ఆపరేషన్ సిందూర్ తో పాక్ లోని ఉగ్రస్థావరాలను భారత్ నేలమట్టం చేసింది. ఈ క్రమంలోనే వరుసగా సీసీఎస్ సమావేశాలు నిర్వహిస్తున్నారు ప్రధాని మోదీ. గత 20 రోజుల్లో సీసీఎస్ భేటీ కావడం ఇది ఐదోసారి. అయితే భారత్-పాక్‌లు కాల్పుల విరమణకు అంగీకారం తెలిపిన తర్వాత సీసీఎస్‌తో ప్రధాని మోదీ భేటీ కావడం తొలిసారి. ఈ సందర్భంగా ప్రధాని మోదీని కేబినెట్ ప్రశంసించింది. ఆపరేషన్ సిందూర్ తో పాకిస్తాన్ కు గట్టిగా బుద్ధి చెప్పారని మోదీని అభినందించింది. సరైన సమయంలో మంచి నిర్ణయం తీసుకున్నారని కేబినెట్ కొనియాడింది. కాగా, పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత భారత్, పాకిస్తాన్ ల మధ్య ఉద్రిక్త పరిస్థితులు చోటు చేసుకున్న సంగతి విదితమే. ఉగ్రవాదుల ఏరివేతే లక్ష్యంగా పాకిస్తాన్ పై దాడికి దిగింది భారత్. పాకిస్తాన్ కు గట్టిగా బుద్ధి చెప్పాలనే ఉద్దేశంతో ఆపరేషన్ సిందూర్ ను ఆరంభించి దాయాది దేశంలోని పలు ఉగ్రస్థావరాలను ధ్వంసం చేసింది. అదే సమయంలో పాకిస్తాన్ లో ని పలు ఎయిర్ బేస్ లను సైతం భారత్ నేలమట్టం చేసింది. పాకిస్తాన్ పదే పదే కవ్వింపు చర్యలకు పాల్పడిన తరుణంలో భారత్ ఆపరేషన్ సిందూర్ తో తన సత్తా ఏమిటో చూపెట్టింది.

## హైదరాబాద్‌లో మాజీ సీఎం కొణిజేటి రోశయ్య కాంస్య విగ్రహం!

హైదరాబాద్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత దివంగత కొణిజేటి రోశయ్య స్మారకార్థం ఆయన కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్‌ఎంసీ) నిర్ణయించింది. ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా ఈ నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్ నగరంలోని లక్డీకపూల్ మెట్రో స్టేషన్ సమీపంలో ఉన్న కూడలిలో ఈ విగ్రహాన్ని ప్రతిష్ఠాపించనున్నారు. తొమ్మిది అడుగుల ఎత్తు ఉండే ఈ కాంస్య విగ్రహం ఏర్పాటుకు సంబంధించి జీహెచ్‌ఎంసీ అధికారులు ఇప్పటికే టెండర్ నోటిఫికేషన్‌ను జారీ చేశారు. అర్హులైన కాంట్రాక్టర్ల నుంచి బిడ్‌లను ఆహ్వానిస్తున్నారు. జూలై 4వ తేదీన కొణిజేటి రోశయ్య జయంతి సందర్భంగా ఈ విగ్రహాన్ని ఆవిష్కరించాలని జీహెచ్‌ఎంసీ భావిస్తోంది. ఈ దిశగా ఏర్పాట్లు ముమ్మరం చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. టెండర్ ప్రక్రియ పూర్తయిన వెంటనే విగ్రహ నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయి. కొణిజేటి రోశయ్య ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సుదీర్ఘకాలం పాటు ఆర్థిక మంత్రిగా, ముఖ్యమంత్రిగా, ఆ తర్వాత తమిళనాడు గవర్నర్‌గా కూడా విశేష సేవలు అందించారు. ఆయన రాజకీయ అనుభవం, పరిపాలనా దక్షత తెలుగు ప్రజల మనసుల్లో చిరస్థాయిగా నిలిచిపోయాయి.

## ఏపీ లిక్కర్ కేసులో కీలక పరిణామం.. సిట్ విచారణకు హాజరైన ధనుంజయ్ రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డి



అమరావతి : ఏపీ లిక్కర్ స్కాం కేసు దర్యాప్తులో కీలక పరిణామం చోటుచేసుకుంది. గత కొంతకాలంగా అజ్ఞాతంలో ఉన్నట్లుగా భావిస్తున్న ధనుంజయ్ రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డి బుధవారం నాడు విజయవాడలోని సిట్ కార్యాలయంలో విచారణకు హాజరయ్యారు. వీరిద్దరూ సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు, తమ న్యాయవాది మన్మథరావుతో కలిసి సిట్ అధికారుల ముందుకొచ్చారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంవో) మరియు జగన్ మోహన్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో ధనుంజయ్ రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డి అత్యంత కీలకంగా వ్యవహరించారని ఆరోపణలున్నాయి. వీరి ప్రమేయం లేకుండా మంత్రులు, ఎమ్మెల్యేలు కూడా ఉన్నతాధికారులను కలవడం కష్టసాధ్యంగా ఉండేదని, నియోజకవర్గాల్లో పనులు జరగాలంటే వీరి ఆమోదం తప్పనిసరి ప్రచారం జరిగింది. ఈ మద్యం కుంభకోణంలో ప్రధాన సూత్రధారిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి అరెస్ట్ అనంతరం సిట్ అధికారులు దర్యాప్తును మరింత ముమ్మరం చేశారు. ఈ కేసులో ఇప్పటికే సజ్జల శ్రీధర్ రెడ్డి, చాణుక్య, దిలీప్‌లతో పాటు మొత్తం నలుగురిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. మంగళవారం నాడు ఈ కేసుతో సంబంధమున్న గోవిందప్ప బాలాజీని కూడా సిట్ అధికారులు అరెస్ట్ చేసి, విజయవాడ ఏసీబీ కోర్టులో హాజరుపరిచారు. గోవిందప్ప బాలాజీ కోర్టు విచారణ కొనసాగుతున్న తరుణంలోనే, ధనుంజయ్ రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డి అనూహ్యంగా సిట్ కార్యాలయానికి చేరుకోవడం ప్రాధాన్యతను సంతరించుకుంది. వీరిద్దరినీ అరెస్ట్ చేసేందుకు సిట్ అధికారులు గత కొన్ని రోజులుగా గాలిస్తున్నట్లు వార్తలు వచ్చాయి. అయితే, వారు తమ పలుకుబడిని ఉపయోగించి దర్యాప్తు అధికారులకు చిక్కకుండా తప్పించుకు తిరుగుతున్నారనే ప్రచారం జరిగింది. ఈ క్రమంలోనే, వారు సుప్రీంకోర్టులో బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన సర్వోన్నత న్యాయస్థానం, మే 16వ తేదీ వరకు వారిపై ఎటువంటి తొందరపాటు చర్యలు తీసుకోవద్దని పోలీసులకు సూచిస్తూనే, దర్యాప్తునకు పూర్తిగా సహకరించాలని ధనుంజయ్ రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డిలను ఆదేశించింది. సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలోనే వారు నేడు విచారణకు హాజరయ్యారు. న్యాయవాది సమక్షంలో వీరిని సిట్ అధికారులు ప్రశ్నిస్తున్నట్టు తెలుస్తోంది. ప్రధానంగా మద్యం పాలసీ రూపకల్పన ఎలా జరిగింది, ఎవరి ఆదేశాల మేరకు ఈ ప్రక్రియ మొత్తం నడిచింది, కీలక నిర్ణయాలు ఎక్కడి నుంచి వెలువడ్డాయి వంటి అంశాలపై అధికారులు ఆరా తీస్తున్నట్టు సమాచారం. ధనుంజయ్ రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డి సిట్ అధికారులకు ఎలాంటి సమాచారం అందిస్తారనేది ఇప్పుడు సర్వత్రా ఆసక్తి రేపుతోంది. వీరిద్దరూ ఇచ్చే వాంగ్మూలం ఆధారంగా ఈ కేసులో మరికొంతమందిని కూడా విచారించే అవకాశాలున్నాయి.

## 'త్వరలోనే తెలంగాణ సీఎం మార్పు.. రేవంత్ స్థానంలో కేసీఆర్'

హైదరాబాద్: బీజేపీ మాజీ ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. తెలంగాణలో ముఖ్యమంత్రి మార్పు ఖాయం.. రేవంత్ స్థానంలో కేసీఆర్ సీఎం అవుతారు అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య రాజీ డీల్ కుదిరిందని అన్నారు. బీజేపీ మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ తాజాగా మీడియాతో మాట్లాడుతూ.. జూన్ రెండో తేదీన లేదా డిసెంబర్ 9 తర్వాత కాంగ్రెస్‌లో బీఆర్ఎస్ విలీనం తథ్యం. బీఆర్ఎస్ విలీనం అవుతుంది. రాష్ట్రంలో సీఎం మార్పు ఖాయం. రేవంత్ స్థానంలో కేసీఆర్ సీఎం అవుతారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య రాజీ డీల్ కుదిరింది. కేటీఆర్ నాయకత్వంలో కూడా పని చేస్తానన్న హరీశ్ రావు వ్యాఖ్యలే అందుకు నిదర్శనం అంటూ కామెంట్స్ చేశారు.

## కల్నల్ సోఫియా ఖురేషీపై బీజేపీ మంత్రి వ్యాఖ్యలు... షర్మిల ఫైర్

మొదటి పేజి తరువాయి




అత్యంత అవమానకరమని, దిగ్భ్రాంతికి గురిచేశాయని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (ఏపీసీసీ) అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఈ వ్యాఖ్యలు కేవలం ఆయన నోరు జారిన మాటలు కావని, బీజేపీ మనస్తత్వంలో పేరుకుపోయిన కుళ్లుకు ఇది స్పష్టమైన నిదర్శనమని ఆమె అభిప్రాయపడ్డారు. ఓ మహిళా ఆర్మీ అధికారిణిపై బీజేపీ మంత్రి చేసిన వ్యాఖ్యలు సమాజంలో తీవ్ర చర్చనీయాంశంగా మారిన నేపథ్యంలో వైఎస్ షర్మిల స్పందించారు. "మంత్రి కున్వర్ విజయ్ షా, కల్నల్ సోఫియా ఖురేషీపై చేసిన మతతత్వ, లైంగిక వివక్షాపూరిత దాడి కేవలం మాటల్లో పొరపాటు కాదు. ఇది బీజేపీ మనస్తత్వంలోని కుళ్లును ప్రతిబింబిస్తుంది. ఆయన వ్యాఖ్యలకు మద్దతుగా చప్పట్లు కొట్టిన వారు ఈ విషయాన్ని మరింత ధృవపరిచారు" అని షర్మిల పేర్కొన్నారు. "మోదీ అండ్ కో గొప్పగా చెప్పుకునే 'కొత్త భారతదేశం' ఇదేనా? గౌరవనీయులైన మహిళా అధికారులను ఇంత నీచమైన మతోన్మాదంతో అవమానించడమేనా నవభారతం?" అని షర్మిల తీవ్ర స్వరంతో ప్రశ్నించారు. ఇది విడిగా జరిగిన సంఘటన కాదని, బీజేపీ మౌలిక సిద్ధాంతమే మతపరమైన ధృవీకరణపై ఆధారపడి ఉందని షర్మిల ఆరోపించారు. "దేశభక్తి ముసుగులో విద్వేషాన్ని దాచిపెట్టి, మతతత్వ రాజకీయాలు చేయడం బీజేపీకి అలవాటుగా మారింది. కేవలం ఎన్నికల లబ్ధి కోసం భారతీయుల మధ్య విభజన రేఖలు గీస్తూ, మన సమాజపు సున్నితమైన నిర్మాణాన్ని అస్థిరపరుస్తున్నారు" అని ఆమె విమర్శించారు. దేశ ఐక్యతను దెబ్బతీస్తూ, మహిళలను అగౌరవపరుస్తూ, ప్రజాస్వామ్యానికి సిగ్గుచేటు తెస్తున్న ఇటువంటి వారిని భారతదేశం తిరస్కరించాల్సిన సమయం ఆసన్నమైందని షర్మిల వ్యాఖ్యానించారు. దేశ ప్రయోజనాలను కాలరాస్తూ, విద్వేషాన్ని వ్యాప్తి చేసే శక్తుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆమె పిలుపునిచ్చారు.

## పెద్దిరెడ్డి భూ కబ్జాలపై విజిలెన్స్ డీజీ నివేదిక

మొదటి పేజి తరువాయి



ఈ ఆక్రమణల వ్యవహారంలో బాధ్యులైన వారిపై క్రిమినల్ కేసులతో పాటు అటవీ పరిరక్షణ చట్టాల కింద కూడా కేసులు నమోదు చేయాలని ఆయన పేర్కొన్నారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి కుటుంబం చిత్తూరు జిల్లా పరిధిలో అటవీ భూములతో పాటు ప్రభుత్వ, బుగ్గ మఠానికి చెందిన భూములను కూడా ఆక్రమించిందంటూ తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ ఆరోపణలపై లోతుగా దర్యాప్తు చేపట్టిన విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీ డిప్యూటీ సీఎం పవన్‌కు సమగ్ర నివేదికను సమర్పించారు. భూ ఆక్రమణలకు పాల్పడిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, అలాగే అటవీ భూములు అన్యాక్రాంతమవుతున్నా నిలువరించడంలో విఫలమైన ప్రభుత్వ అధికారులను గుర్తించి, వారిని బాధ్యులను చేయాలని ఆ నివేదికలో డీజీ సిఫార్సు చేసినట్లు తెలిసింది. విజిలెన్స్ డీజీ అందించిన నివేదికను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అటవీ శాఖ ఉన్నతాధికారులతో ప్రత్యేకంగా సమావేశమై చర్చించారు. ఈ సందర్భంగా అటవీ భూముల పరిరక్షణలో నిర్లక్ష్యం వహించిన అధికారుల వివరాలను గుర్తించి, వారిపై తక్షణమే శాఖాపరమైన చర్యలు ప్రారంభించాలని ఆదేశాలు జారీ చేసినట్టు తెలిసింది. పెద్దిరెడ్డి కుటుంబ సభ్యులు అటవీ భూములను ఆక్రమిస్తున్న సమయంలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ, వారికి సహకరించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులపైనా కఠినంగా వ్యవహరించాలని ఆయన సూచించారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీ చేసిన సిఫార్సులకు అనుగుణంగా తదుపరి చర్యలు వేగవంతం చేయాలని అటవీ అధికారులకు పవన్ స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్టు సమాచారం.

## శ్రీ జగజ్జనని
## రేణుక ఎల్లమాంబ అమ్మవారికి వైభవంగా కళ్యాణ్ ఉత్సవం



సిద్ధవటం, మండల విలేకరి - జాకీర్ హుస్సేన్(శుభోదయం న్యూస్) : మండల పరిధిలోని మాచుపల్లి లోని పెన్నా నది ఒడ్డున వెలసిన శ్రీశ్రీశ్రీ జగజ్జనని రేణుక ఎల్లమాంబ తిరుణాల సందర్భంగా, బుధవారం రోజు మధ్యాహ్నం 3 గంటలకు అమ్మవారి కళ్యాణం రంగ రంగ వైభవంగా కళ్యాణ్ వాయిద్యాలతో కన్నుల పండుగ నిర్వహించారు.అదే రోజు సాయంత్రం ఆరు గంటల నుండి సింహ వాహనంపై అమ్మవారికి పురవీధులలో ఊరేగింపు కార్యక్రమం జరిగింది రాత్రి 8 గంటల నుండి భక్తులందరికీ పాట కచేరి ప్రోగ్రాం జరుగుతుంది అనంతరం అమ్మవారికి ఏనుగు వాహనంపై అమ్మవారి ఊరేగింపు వాయిద్యములతో గొప్ప ఊరేగింపు జరిగింది అనంతరం సిద్ధాంతం కథ రూపంలో నిర్వహించారు. అలాగే నేడు ఉదయం నుండి అమ్మవారికి బోనాలు మొక్కుబడులు చెల్లించుట ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు గ్రామ దేవతకు కు బోనాలు పెట్టడం మధ్యాహ్నం మూడు గంటల నుండి సీనియర్ బండలాగుడు పోటీలను నిర్వహిస్తామన్నారు. బండలాగుడు పోటీలలో మొదటి బహుమతి ఒక్క లక్ష 116 రూపాయలు రెండవ బహుమతి 70 వేల 116 రూపాయలు మూడో బహుమతి 50వేల నూట పదహారు రూపాయలు నాలుగవ బహుమతి 30 వేల 116 రూపాయలు ఐదవ బహుమతి 20వేల 116 రూపాయలు బహుమ తులు అందజేస్తామని మాచుపల్లి గ్రామ పెద్దలు తెలిపారు.

## వైభవంగా చౌడేశ్వరి దేవి జ్యోతుల మహోత్సవం



రెంటచింతల, మండల రిపోర్టర్ - శ్రీనివాసరావు (శుభోదయం న్యూస్): స్థానిక రైల్వే స్టేషన్ రోడ్ లోని చౌడేశ్వరి ఆలయంలో అమ్మవారి జ్యోతుల మహోత్సవం గత రాత్రి వైభవంగా జరిగింది. నృత్యాలు, డప్పు వాయిద్యాల నడుమ భక్తులు జ్యోతులు తీసుకుని ఆలయానికి చేరుకోవడంతో పరిసర ప్రాంతాల్లో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. అమ్మవారికి సహస్రనామ కుంకుమార్చన, పసుపు కుంకుమ, పట్టు వస్త్రాల అలంకరణ చేసి దిష్టిచుక్క పెట్టిన అనంతరం మంగళవారం బహుళ పాడ్యమి రాత్రి 1.30 గం.లకు అనురాధ నక్షత్ర యుక్త కుంభ లగ్న పుష్కరాంశం నందు అమ్మవారి జ్యోతి మహోత్సవంలో ప్రధాన ఘట్టమైన చౌడేశ్వరి దేవి జ్యోతి ఉత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. జ్యోతికి ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారికి పుణ్యాహవచనం, శాంతి పూజలు నిర్వహించారు. జ్యోతులకు ముందు గ్రామ వీధుల్లో సాగిన ఊరేగింపులో మహిళలు కలశాలతో, వాయిద్యాలతో కళాకారులు పాల్గొన్నారు. మహిళా భక్తులు వాయిద్యాలు మోగిస్తూ ఊరేగింపులో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. భక్తులు అమ్మవారి జ్యోతులను తలపై ఉంచుకొని నృత్యం చేస్తూ భక్తిశ్రద్ధలతో ఊరేగింపులో పాల్గొన్నారు.అమ్మవారి ఆలయం చేరుకుని ఆలయంలో కొలువుదీరిన చౌడేశ్వరి దేవిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు.ఆలయ నిర్వాహకులు భక్తులకు మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు.తొగట వీర క్షత్రియుల ఇలవేల్పు చౌడేశ్వరి దేవిని పరిసర ప్రాంతాల భక్తులు విశేషంగా దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. గ్రామంలోని పలు కాలనీలకు చెందిన అమ్మవారి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని చౌడేశ్వరి దేవిని దర్శించుకున్నారు. తొగట వీర క్షత్రియ సేవా సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఉత్సవ వేడుకలు భక్తులను కనువిందు చేశాయి.




## బ్రహ్మనపల్లి గ్రామ సమీపంలో రోడ్డు ప్రమాదం




పిడుగురాళ్ల, టౌన్ రిపోర్టర్ శీనివాసరావు (శుభోదయం నూస్): రొంపిచర్ల మండలం, ఎడ్వార్డుపేట గ్రామానికి చెందిన పేరం వెంకటేశ్వర్ రెడ్డి, వయసు 62సం. అను అతను పెదగార్లపాడు గ్రామం నుండి మనవడిని తీసుకుని ఉదయం 034358 స్కూటీ పై బయలుదేరి ఎడ్వర్డుపేట గ్రామం వచ్చే క్రమంలో పిడుగురాళ్ళ మండలం బ్రహ్మనపల్లి గ్రామ సమీపంలో లోని మురుగన్ హోటల్ ఎదురుగా వచ్చు సరికి అదుపు తప్పి రోడ్డు ప్రక్కన ఉన్న పోల్ కి ఢీ కొనగా తలకి బలమైన గాయమై వేంకటేశ్వర రెడ్డి అక్కడికక్కడే చనిపోయారు. పిల్లవానికి తల వద్ద చిన్న గాయం అయినది.పిడుగురాళ్ళ పోలీసు వారు కేసు నమోదుచేసుకుని విచారిస్తున్నారు.

## నేడు పెండేకల్ ఆర్ఎస్ లో
## దస్తగిరిస్వామి ఉరుసు మహోత్సవం.....



తుగ్గలి, మండల రిపోర్టర్ మాధవ్ (శుభోదయం న్యూస్ ): మండల పరిధిలోని పెండేకల్ ఆర్ఎస్ గ్రామంలో వెలిసిన శ్రీశ్రీశ్రీ హజరత్ సయ్యద్ మెహబూబ్ సుభాహాని( దస్తగిరిస్వామి)(ర.జి )వారి 2వ ఉరుసు మహోత్సవము వేడుకలు గురువారం జరుగుతున్నట్లు గ్రామ పెద్దలు,గ్రామ ప్రజలు బుధవారం విలేకరులకు తెలిపారు.కావున భక్తదాలందరూ పూజా కార్యక్రమములో పాల్గొని స్వామివారి ఆశీర్వాదం పొందగలరని గ్రామ పెద్దలు తెలిపారు.

## జొన్నగిరిలో ఉచిత
## కంటి వైద్య శిబిరం శిబిరాన్ని ప్రారంభించిన టిడిపి నాయకులు....



తుగ్గలి, మండల రిపోర్టర్ మాధవ్ (శుభోదయం న్యూస్ ): తుగ్గలి పత్తికొండ నియోజకవర్గం లోనే పేదలకు వైద్యం అందించేందుకు ఎమ్మెల్యే కెఈ శ్యామ్ కుమార్ ఎంతో కృషి చేస్తున్నారని జొన్నగిరి సర్పంచ్ ఓబులేసు, మాజీ ఎంపీపీ గురు స్వామి లు అన్నారు. బుధవారం జొన్నగిరి గ్రామపంచాయతీ కార్యాలయంలో కర్నూల్ సుశీల నేత్ర వైద్యశాల వారు నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సర్పంచ్ ఓబులేసు, మాజీ ఎంపీపీ గురు స్వామి లు ప్రారంభించారు. ఈ సందర్భంగా టిడిపి మండల అధ్యక్షులు రాంపల్లి తిరుపాల్ నాయుడు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఓబులేసు, గురుస్వామి లు మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా




చంద్రబాబు నాయుడు పేదలకు వైద్యం అందించాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నారని, అందువల్ల పత్తికొండ ఎమ్మెల్యే కెఈ శ్యామ్ కుమార్ నియోజకవర్గంలోనే అన్ని గ్రామాలలో ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారని వారు అన్నారు. అందువల్ల ఈ శిబిరాలకు ప్రజలు హాజరై వైద్య పరీక్షలు చేయించుకోవాలని వారు కోరారు. వైద్య పరీక్షలు చేయించుకున్న వారిలో ఎవరికైనా ఆపరేషన్ అవసరం అయితే ఎన్టీఆర్ ఆరోగ్య శ్రీ కింద ఉచిత వైద్యం ఉచిత ఆపరేషన్ లో చేయడం జరుగుతుందని వారు తెలిపారు. ఈ అవకాశాన్ని గ్రామాలలోనే ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నారాయణస్వామి, మాజీ వైస్ ఎంపీపీ చంద్రశేఖర్ యాదవ్, టిడిపి నాయకులు బాలన్న, లక్ష్మణ్ స్వామి, హొటల్ మల్లికార్జున, ఫోటో కృష్ణ, మీసాల శేఖర్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## పంచాయతీ కార్యదర్శి చొరువతో తీరిన నీటి సమస్య



నల్లచెరువు, మండలం రిపోర్టర్ - మాలిక్ బాషా, మే 14 (శుభోదయం న్యూస్) : మండల కేంద్రంలోని మేజర్ పంచాయతీ కార్యదర్శి నరేష్ కుమార్ చొరువతో ఒక్కరోజులో నీటి సమస్య తీరింది.మండల కేంద్రంలోని వీవర్స్ కాలనీలో సోమవారం నీటి కుళాయిలలో మురికి నీరు కలుషితమై వస్తున్నాయని మంగళవారం కొన్ని పత్రికలలో వార్తలు వచ్చాయి.దీనికి స్పందించిన పంచాయతీ కార్యదర్శు నరేష్ కుమార్,మేజర్ పంచాయతీ సర్పంచ్ రత్నమ్మ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం కలుషిత నీటికి గల కారణాలను పరిశీలించారు.కె.పూలకుంట గ్రామంలోని చెరువు నుండి సరఫరా అవుతున్న నీటి పైపులు లీకేజ్ అవడంతో నీరు కలుషితమైందన్నారు.వెంటనే లీకేజ్ అయిన పైపులను మరమ్మతులు చేయించి నీటిని సరఫరా చేయించడం జరిగిందన్నారు. గతంలో ఎప్పుడూ ఇలా జరగలేదని పైపులు లీకేజ్ అవడంతోనే నీరు కలుషితమైందని పేర్కొన్నారు.ఇక మీదట ఇటువంటివి జరక్కుండా జాగ్రత్త పడాలని నీటి సరఫరా సిబ్బందికి సూచించారు.గ్రామంలో ఎక్కడైనా నీటి సమస్య,వీధి బలుపులు,మురికినీటి కాలువలు వంటి సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.వాటి పరిష్కార మార్గమే లక్ష్యంగా విధులు నిర్వహిస్తామని పేర్కొన్నారు.ఈ సందర్భంగా కలుషితమైన నేటి సమస్యను ఒక్కరోజులో పరిష్కరించిన పంచాయతీ కార్యదర్శికి కాలనీ వాసులు అభినందనలు తెలిపారు.

## పాత్రికేయుడు
## వివేకానంద రెడ్డి వర్ధంతి సందర్భంగా రక్తదానం



నల్లచెరువు, మండలం రిపోర్టర్ - మాలిక్ బాషా, మే 14 (శుభోదయం న్యూస్) : మండల కేంద్రానికి చెందిన సీనియర్ పాత్రికేయుడు దేవరింటి వివేకానంద రెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన శిష్యులు బుధవారం కదిరి ప్రభుత్వ ఆసుపత్రిలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఆయన అభిమానుల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఈ రక్తదాన శిబిరంలో ఆయన శిష్యులు ఉత్సాహంగా ముందుకు వచ్చి రక్త దానం చేశారు.అనంతరం వారు మాట్లాడుతూ మండలంలో ఒక పాత్రికేయుడిగానే కాకుండా ఎంతో మంది పేద విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించిన గురువుగా వివేకానంద రెడ్డికి మంచి గుర్తింపు ఉందన్నారు.మండలంలో ఎంతోమంది యువకులు ఆయన ఆదర్శంగా నిలిచారన్నారు.ఆయన మృతి చెంది ఇప్పటికి 5 సంవత్సరాలు అయినప్పటికీ ఆయన నేర్పిన విద్య,సంస్కారం, వినయ,విధేయతల రూపంలో ఎప్పటికీ తమ మధ్యనే ఉంటాయన్నారు.కార్యక్రమంలో పవన్ కుమార్,పురుషోత్తం రెడ్డి, హరీష్,వెంకీ,తదితరులు పాల్గొన్నారు.

## నాయీ బ్రాహ్మణ ఫెడరేషన్ ద్వారా
## ఆధునిక సెలూన్ కు 10 లక్షలు రుణం అందించాలి

### ఆంధ్రప్రదేశ్ నాయీబ్రాహ్మణ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు తాటికొండ నరసింహారావు



గుంటూరు జిల్లా, (శుభోదయం న్యూస్) : ఆంధ్రప్రదేశ్ నాయీబ్రాహ్మణ ఫెడరేషన్ ద్వారా ఏపీలో ఉన్న నగరాలలో మున్సిపల్ హెడ్ క్వార్టర్స్ లో నాయీ బ్రాహ్మణ క్షవరవృత్తిదారులకు ఆధునిక సెలూన్లు ఏర్పాటు నిమిత్తం 10 లక్షల రూపాయలు సబ్సిడీ రుణాలు అందించి క్షవరవృత్తి దారులను ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ నాయీబ్రాహ్మణ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు తాటికొండ నరసింహారావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అనాదిగా క్షవర వృత్తిని నమ్ముకొని వృత్తికి ఆదాయం లేని రోజుల్లో వృత్తిని దైవంగా భావించి ఈ సమాజానికి సేవలందించిన క్షవర వృత్తి దారుల జీవితాలు సంక్షోభంలోకి నెట్టివేయబడ్డాయని ఆవేదన చెందారు. కార్పొరేట్ శక్తులు సెలూన్ రంగంలో ప్రవేశించి కోట్ల రూపాయలు పెట్టుబడి పెట్టి నాయీబ్రాహ్మణ వృత్తి దారులు పొట్టలు కొడుతున్నారని వృత్తి ని నమ్ముకొని అనాదిగా జీవిస్తున్న బార్బర్ షాప్ వాళ్లని ఆదుకొనుటకు నేటి కూటమి ప్రభుత్వం కృతనిశ్చయముతో ముందుకు వస్తున్నది ఆశాభావం వ్యక్తం చేశారు. మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ ఎన్టీ రామారావు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు నాయీ బ్రాహ్మణులకు ఫెడరేషన్ ఇచ్చి వృత్తిదారులను ఆదుకున్నటువంటి తొలి ముఖ్యమంత్రి ఎన్టీఆర్ అని గుర్తు చేశారు. నేడు చంద్రబాబు ప్రభుత్వం దేవాలయాలలో పనిచేసే క్షురకులకు 25 వేల రూపాయలు వేతనాన్ని పెంచటం హర్షనీయమన్నారు అదేవిధంగా బార్బర్ షాప్ ఉన్న ప్రతి నాయీ బ్రాహ్మణుడుకి 200 యూనిట్లు ఉచితంగా విద్యుత్ అందించాలని నరసింహారావు ప్రభుత్వాన్ని కోరారు. ఈ ప్రకటన విడుదల చేసిన వారిలో నాయీబ్రాహ్మణ జేఏసీ గుంటూరు అర్బన్ కమిటీ కార్యదర్శి తిరువళ్లూరు హరినాథ్ బాబు సౌందర్య శాలల సంక్షేమ విభాగం కార్యదర్శి జి భాస్కర్ ఉపాధ్యక్షులు పి శ్రీమన్నారాయణ ఎన్ రవీంద్ర తదితరులు ఉన్నారు.

## శ్రీ సువర్చలా సమేత ప్రపత్యాంజనేయ స్వామి దేవస్థానం
## నిర్మాణానికి విరాళం ఎమ్మెల్యే నరేంద్ర వర్మకి అందజేశారు



(శుభోదయం న్యూస్) : బాపట్ల శ్రీ సువర్చలా సమేత ప్రపత్యాంజనేయ స్వామి దేవస్థానం నిర్మాణంలో భాగంగా తటవర్తి సుబ్రమణ్య గుప్త (అప్సరా చిన్న ) .1,11,116/-కోకా మురళీకృష్ణరావ్, భవాని దంపతులు .50116/-. కరియంపూడి వెంకటేశ్వర్లు, లక్ష్మీ ప్రసన్న దంపతులు .50116/- బాపట్ల ఎమ్మెల్యే వేగేసిన నరేంద్ర వర్మ కి అందజేయడం జరిగింది . ఇందులో నిర్మాణకమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## జాతీయ జంప్ రోప్ శిక్షణ శిబిరానికి
## హాజరైన ఆంధ్రప్రదేశ్ క్రీడాకారులు, శిక్షకులు





గన్నవరం, నియోజకవర్గ ఇన్చార్జ్ - సురేష్ (శుభోదయం న్యూస్) :మే 14భారత జంప్ రోప్ సమాఖ్య ఆధ్వర్యం లో గోవా రాష్ట్రంలో జపాన్ దేశంలో జరగబోయే అంతర్జాతీయ జంప్ రోప్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు నిర్వహించిన శిక్షణ శిబిరంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి భారత జంప్ రోప్ పోటీలకు ప్రాతినిత్యం వహిస్తున్న క్రీడాకారులు, జాతీయ స్థాయి న్యాయ నిర్నేతల శిక్షణ శిబిరానికి న్యాయం ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు పాల్గొన్నట్లు ఆంధ్రప్రదేశ్ జంప్ రోప్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సి వి సుబ్బయ్య తెలిపారు. ఈ శిక్షణ శిబిరం అంతర్జాతీయ స్థాయి శిక్షకుల పర్యవేక్షణలో వారం నుండి పది రోజులు కొనసాగుతుందని అన్నారు. దేశానికి పథకాలు సాధించే దిశగా ఇక్కడ శిక్షణ శిబిరం కొనసాగుతుందని ఇందులో ఆంధ్రప్రదేశ్ క్రీడాకారులు ఉండడం ఎంతో గర్వంగా ఉందని అన్నారు. ఇక్కడ శిక్షణ పొందిన వ్యాయామ ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు కూడా జాతీయ న్యాయ నిర్ణయతలుగా భారత జంప్ రోప్ సంఘం నుండి గుర్తింపు పొందిన శిక్షకులుగా కొనసాగుతారని అన్నారు. ఇంతటి చక్కటి అవకాశం అన్ని ఆంధ్ర ప్రదేశ్ ఉపాధ్యాయులకు కల్పించిన భారత జంప్రోప్ క్రీడా సంఘానికి సుబ్బయ్య అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ జంప్ రోప్ సంఘం చైర్మన్ రాజు, సభ్యులు మురళి, విజయ్, పకీరయ్య తదితరులు పాల్గొన్నారు.

## యార్లగడ్డ చొరవతో
## విద్యుత్ ప్రమాద మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం



గన్నవరం, నియోజకవర్గ ఇన్చార్జ్ - సురేష్ (శుభోదయం న్యూస్) : విద్యుత్ ప్రమాద మృతుని కుటుంబానికి ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు చొరవతో నష్టపరిహారం అందింది. బాపులపాడు మండలం, బండారుగూడెం గ్రామానికి చెందిన మరీదు గోవిందులు (33 ) ఈ ఏడాది జనవరి నెల 12 వ తేదీ విద్యుత్ షాక్ గురై ప్రాణాలు కోల్పోయాడు. మృతునికి భార్య, ఒక కుమార్తె (2 )లు ఉండగా కుటుంబ పెద్ద మరణంతో వీరిద్దరు అనాథలుగా మిగిలారు. దీంతో ఈ కుటుంబ దుస్థితిని బండారు గూడెం గ్రామ పార్టీ అధ్యక్షులు కొండేటి నాగరాజు ప్రభుత్వ విప్, గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే స్పందించిన యార్లగడ్డ విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి మృతుని భార్య పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని మృతుని కుటుంబానికి పరిహారం అందించాలని ఆదేశించారు. మృతుని కుటుంబ సభ్యులకు సహకరించాలని తన వ్యక్తిగత సిబ్బందిని ఎమ్మెల్యే యార్లగడ్డ ఆదేశించారు. ఈ మేరకు విద్యుత్ శాఖ నియమ నిబంధనల ప్రకారం గోవిందులు మృతిపై విచారణ జరిపిన అధికారులు ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి మృతి చెందినట్లు నిర్ధారించుకొని అతని కుటుంబానికి రాష్ట్ర విద్యుత్ శాఖ తరపున రూ.5 లక్షల రూపాయల పరిహారాన్ని మంజూరు చేశారు. మంగళవారం సాయంత్రం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఉండగా మృతుడు మరీదు గోవిందులు కుటుంబ సభ్యులైన అతని భార్య మరీదు వందన, కుమార్తె మరీదు ప్రణయ స్థానిక నాయకులతో కలిసి గౌరవ శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావును కలిసి తమ కుటుంబానికి అండగా నిలిచి పరిహారం అందే విధంగా కృషి చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ కార్యకర్తలకు, అభిమానులకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని వారికి ఏ కష్టం వచ్చినా తప్పకుండా సహాయ సహకారాలు అందిస్తామని భరోసా ఇచ్చారు. పార్టీ తరపున మరికొంత ఆర్థిక సహాయం అందే విధంగా కృషి చేస్తానని మృతుని కుటుంబ సభ్యులకు యార్లగడ్డ హామీ ఇచ్చారు.

## గన్నవరం ముఖచిత్రాన్ని మార్చే పనులు వేగవంతం చెయ్యండి : ఎమ్మెల్యే యార్లగడ్డ



గన్నవరం, నియోజకవర్గ ఇన్చార్జ్ - సురేష్ (శుభోదయం న్యూస్) :జాతీయ రహదారి డివైడర్లు, పుట్‌పాత్‌ల సుందరీకరణ పనులను మరింత వేగవంతం చేయాలని ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అధికారులను కఠినంగా ఆదేశించారు. బుధవారం మధ్యాహ్నం విజయవాడలోని తన క్యాంప్ కార్యాలయంలో జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.వెంకట్రావు మాట్లాడుతూ, "గన్నవరం విమానాశ్రయం అమరావతికి ప్రధాన ద్వారం. ఇది రాష్ట్రానికి వచ్చే పారిశ్రామికవేత్తలు, విదేశీ అతిథులు,



విఐపిలు మొదలైన వారికి తొలిగా చూసేటువంటి ప్రాంతం మరింత అందంగా, శుభ్రంగా ఉండాల్సిన అవసరం ఉంది," అని వివరించారు.డివైడర్లపై మొక్కలు లేని చోట్ల తక్షణమే మొక్కలు నాటాలని, పుట్‌పాత్‌లపై ఆకర్షణీయమైన కుండీలు ఏర్పాటు చేసి అందులో హరిత ముసుగు ఏర్పడేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. డివైడర్లపై సృజనాత్మక, రంగులద్దిన చిత్రలేఖనాలతో వీధి దృశ్యాన్ని మారుస్తూ ప్రజలకూ ఆనందాన్ని కలిగించేలా తీర్చిదిద్దాలని సూచించారు."సౌందర్యంతో పాటు పర్యావరణ పరిరక్షణకూ ఇది ఓ భాగమవుతుంది. ప్రజల్లో కూడ గర్వాన్నీ, శుభ్రత పట్ల బాధ్యతనూ కలిగించేలా ఉండాలి," అని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ఈ సమావేశంలో ఎన్‌టిఆర్ జిల్లా డిపివో, అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అధికారులు, ఇతర సంబంధిత శాఖల ప్రతినిధులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధికి అనుకూల వాతావరణం : పురందేశ్వరి



గన్నవరం, నియోజకవర్గ ఇన్చార్జ్ - సురేష్ (శుభోదయం న్యూస్) : పరిశ్రమలు ఏర్పాటుకు రాష్ట్రంలో అనుకూల వాతావరణ ఏర్పడిందని విశాఖపట్నం ఎంపీ బిజెపి రాష్ట్ర అధ్యక్షులు దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. బాపులపాడు మండలం మల్లవల్లి పారిశ్రామిక వాడలో ఫోక్స్ ఆపిరల్స్ నిర్మాణానికి బుధవారం సాయంత్రం గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు తో కలిసి భూమి పూజ చేశారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో గత ఐదేళ్లు అప్పటి ప్రభుత్వం పారిశ్రామికవేత్తలను ఎన్నో వేధింపులకు గురి చేయటంతో వారిలో ఎక్కువమంది ప్రభుత్వ వేధింపులు భరించలేక రాష్ట్రం నుండి పారిపోయారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు అనుకూల వాతావరణ ఏర్పడిందని పేర్కొన్నారు. మల్లవల్లి పారిశ్రామిక వాడ కు రాష్ట్రంలోనే నెంబర్ వన్ స్థానంలో తీర్చిదిద్దేందుకు గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నారని కొనియాడారు. ప్రభుత్వ ప్రోత్సాహాన్ని అందిపుచ్చుకొని ఎక్కువ మంది పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని పిలుపునిచ్చారు. గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ మల్లవల్లి పారిశ్రామిక వాడలో పరిశ్రమలు ఏర్పాటు చేసే వారికి అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వం వేధింపులు గురి చేసే తరిమేసిన పారిశ్రామికవేత్తలను తిరిగి ఇక్కడికి తీసుకువచ్చి వారితో పరిశ్రమలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. పరిశ్రమలకు భూములు పొందినవారు 18 నెలల లోపు పరిశ్రమల స్థాపించాలని లేకుంటే భూములను వెనక్కి తీసుకుంటామని యార్లగడ్డ హెచ్చరించారు. టిడిపి పోలీసు బ్యూరో సభ్యులు తొండేపు దశరథ జనార్దన్ మాట్లాడుతూ గన్నవరం నియోజకవర్గ అభివృద్ధికి యార్లగడ్డ వెంకట్రావు చేస్తున్న కృషి అభినందనీయం అన్నారు. మిట్ట మధ్యాహ్నం రెండు గంటల సమయంలో ఆయన జాతీయ రహదారిపై పుట్టుపాత్ పనులను మండుటెండలో చేయిస్తుండగా తాను ఆ దారిలో వెళుతూ ఆగి ఆయనను అభినందించానని ఈ సందర్భంగా గుర్తు చేశారు. పారిశ్రామికవేత్తలకు తమ ప్రభుత్వం పూర్తి ప్రోత్సాహాన్నిస్తుందని ఏ ఇబ్బందున్న ఎమ్మెల్యే యార్లగడ్డ దగ్గర తీసుకువెళ్తే సమస్యను వెంటనే పరిష్కరిస్తారని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మహిళా కమిషన్ చైర్పర్సన్ రాయపాటి శైలజ, ఏపీయస్సాయేమ్‌ఈ చైర్మన్ శివశంకర్, బిజెపి నాయకులు చిగురుపాటి కుమార్ స్వామి, తుమ్మల అంజిబాబు, టిడిపి నాయకులు ముల్పూరి సాయి కళ్యాణి, దయ్యాల రాజేశ్వరరావు, పుట్టా సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణానికి శ్రమించిన అందరికీ హృదయపూర్వక అభినందనలు మంత్రి నియోజకవర్గ ఇన్చార్జ్ హరీష్ బాబు



ఉమ్మడి అనంతపురం జిల్లాకు బ్యూరో "నరేంద్ర" (శుభోదయం న్యూస్) : ధర్మవరం పట్టణంలోని కేశవ నగర్‌లో భక్తిశ్రద్ధలతో, విశేషమైన భౌతిక నిర్మాణ శైలి తో ప్రతిష్టాత్మకంగా నిర్మించబడిన శ్రీ అయ్యప్ప స్వామి వారి దేవాలయం బుధవారం ఘనంగా ప్రారంభించబడింది. అనేకమంది భక్తులు మరియు స్థానిక ప్రజలు ఈ పవిత్ర కార్యక్రమంలో పాల్గొని స్వామివారి దివ్య దర్శనాన్ని పొందారు. ఆలయ కమిటీ వారి ఆహ్వాన మేరకు మంత్రి నియోజకవర్గ ఇన్చార్జ్ హరీష్ బాబు ముఖ్యఅతిథిగా హాజరై, అయ్యప్ప స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వేదపండితుల ఆధ్వర్యంలో హెూమాలు, అభిషేకాలు, అర్చనలు ఎంతో భక్తిశ్రద్ధలతో జరిగాయి.



ఈ సందర్భంగా హరీష్ బాబు మాట్లాడుతూ, ఈ దేవాలయం ధర్మవరం వాసులకు ఆధ్యాత్మికశాంతి, సామూహిక ఐక్యతకు కేంద్రబిందువుగా నిలవాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నాను. ఇటువంటి పవిత్ర ఆలయ నిర్మాణానికి శ్రమించిన అందరికీ హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నాను అని అన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం కూడా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, పురోహితులు, మంత్రి కార్యాలయ సిబ్బంది, , స్థానిక నాయకులు, ప్రజలు, బిజెపి నాయకులు డోలా రాజారెడ్డి, బిల్లే శ్రీనివాసులు, జూటూర్ వెంకటేష్, పోతుకుంట రాజు, తదితరులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.

## మున్సిపల్ చైర్మన్ అవిశ్వాస తీర్మానం సమావేశం లో పాల్గొన్న ఎమ్మెల్యే ఎంపీ



(శుభోదయం న్యూస్) బాపట్ల జిల్లా: చీరాల మున్సిపల్ కార్యాలయంలో ఛైర్మన్ మీద జరిగిన అవిశ్వాస తీర్మానం సమావేశంలో స్థానిక ఎమ్మెల్యే యం యం కొండయ్య తో కలిసి పాల్గొని ఎక్స్ అఫిషియో సభ్యునిగా



ఓటు వేసిన,బాపట్ల పార్లమెంట్ సభ్యులు, లోక్ సభ ప్యానెల్ స్పీకర్ తెన్నేటి కృష్ణప్రసాద్ ఈ సమావేశంలో టీడీపీ కౌన్సిలర్లు ప్రవేశ పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది.

## మిరియం గురవయ్యను పరామర్శించిన దారపనేని బ్రదర్స్



పామూరు, మండలం రిపోర్టర్ బండి రమేష్ (శుభోదయం న్యూస్): కనిగిరి నియోజకవర్గం పామూరు మండలం తూర్పు కోడిగుడ్లపాడు గ్రామపంచాయతీ పోతవరం గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు మిరియం గురవయ్య ఇటీవల గుండెపోటు వ్యాధితో బాధపడుతూ ఒంగోలు కిమ్స్ కార్పొరేట్ హాస్పటల్లో మెరుగైన వైద్యం చేయించుకుని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగివచ్చారు. బుధవారం కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్ , తూర్పు కోడిగుడ్లపాడు మాజీ సర్పంచ్ దారపనేని జనార్ధన్ రావు మిరియం గురవయ్యను పరామర్శించి సోదరుడు మిరియం సుబ్బరాయుడును యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. దారపనేని చంద్రశేఖర్ గురవయ్యతో ఆరోగ్యం పై అశ్రద్ధ విడనాడి ఆరోగ్యవంతులుగా ఉండేందుకు కృషి చేయాలన్నారు. నాగినేని రమేష్ బాబు, చెనికల చిన మాల కొండయ్య, నాగేశ్వరరావు, శ్రీనివాసులు, కొండయ్య (కరణం ) మానం మల్లికార్జునరావు, ధనియాల తిరుపతయ్య మిరియం గురవయ్యను పరామర్శించిన వారిలో ఉన్నారు.

## మండలాల పర్యటన నిర్వహించిన జిల్లా బిజెపి అధ్యక్షులు సెగ్గం శ్రీనివాసులు



పామూరు, మండలం రిపోర్టర్ బండి రమేష్ (శుభోదయం న్యూస్): పామూరు మండల కార్యవర్గ సమావేశం అమ్మ ఫంక్షన్ హాల్ లో బిజెపి మండల అధ్యక్షులు ఉమ్మడిశెట్టి శ్రీను అధ్యక్షతన జరిగిన కార్యక్రమం నకు జిల్లా బిజెపి అధ్యక్షులు శ్రీ సెగ్గం శ్రీనివాసులు, నియోజకవర్గం బిజెపి కన్వీనర్ కొండిశెట్టి వెంకట రమణయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి నరాల శ్రీనివాసరెడ్డి,జిల్లా ఉపాధ్యక్షులు అమర సింహ, అతిథులుగా పాల్గొని జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు మరియు వెంకటరమణయ్య, మాట్లాడుతూ, సంస్థాగతంగా మండలంలో బూతు స్థాయి, శక్తి కేంద్రం స్థాయి, లలో పార్టీ నిర్మాణం చేపట్టాలని, సీనియర్ నాయకులు,



పాత కొత్త పార్టీ నాయకుల కలయికతో మండలంలో ప్రియతమ ప్రధానమంత్రి ఈ నరేంద్ర మోడీ గారు ప్రవేశపెట్టిన జాతి స్థాయిలో పథకాలను, మరియు ఆర్థికంగా, నూతనంగా ఏర్పడ్డ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి మోడీ గారు ఎన్డీఏ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక సంక్షేమ పథకాలతోటి రాష్ట్ర అభివృద్ధి ధ్యేయంగా మన రాష్ట్రానికి అత్యధికముగా అమరావతి,పోలవరం,నిర్మాణమునకు జాతీయ ఉపాధి హామీ, పంచాయతీ రాజ్, కార్పొరేషన్లు, ఎన్ ఆర్ జె సి నిధులు, గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు నిర్మాణం, మౌలిక వసతులు,అనేక సంస్థలకు అత్యధిక నిధులు కేటాయిస్తూ ఉన్నటువంటి విషయం బూతు స్థాయిలో పార్టీ క్రియాశీలక కార్యకర్తలుగా మండల స్థాయిలో బూతు స్థాయి వరకు ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోవటం జరిగింది ఈ కార్యక్రమంలో కొప్పరపు సుబ్బారావు, ద్రోణాదుల చరణ్, పెరమణ విజయ్ కుమారచారి, బొంతల అజయ్ కుమార్, కొత్తూరి హరగోపాల్, సి హెచ్ మల్లికార్జున, జాయం చిన్న సుబ్బయ్య, శ్రీనివాసులు రెడ్డి, కోటా సురేష్ బాబు, పందిరి శ్రీనివాసులు, నీరు కట్టు రవి,యాదల రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

## దోర్నాల లో అయిన ముక్కుల గ్రామంలో తాగునీటి సమస్య




దోర్నాల మండల రిపోర్టర్ ఆవులయ్య (శుభోదయం న్యూస్ ): ప్రకాశం జిల్లాపెద్ద దోర్నాల మండలం పట్టణంలో మరియు దోర్నాలమండలం. అయిన ముక్కుల గ్రామ వాసులు నీటి కోసం బుధవారం మేజర్ పంచాయతీ దోర్నాల నందు కాలి నీటి బిందెలతో ధర్నా చేశారు. ఆందోళనకు దిగారు బోర్లు ఎండిపోవడం ట్యాంకర్లు సమయానికి రాకపోవడంతో కిలోమీటర్ల దూరం నడిచి నీరు తెచ్చుకుంటున్నారు. దీని విషయమై అధికారులు చొరవ తీసుకొని తాగునీటి సౌకర్యం కలిగించాలని కోరుతున్నారు అలాగే దోర్నాల మండలంలో కరెంటు సమస్య ఎక్కువగా ఉన్నందున ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నారు కావున అధికారులు స్పందించి కరెంటు సమస్య లేకుండా చేయాలని కోరుతున్నారు.

## అపరమేధావి
## డాక్టర్ గుగ్గిళ్ళ దివ్యమూర్తికి గురుప్రపూర్ణ జాతీయ అవార్డు..



అనంతగిరి .మే 14 (శుభోదయం న్యూస్):ఖమ్మంజిల్లా నేలకొండపల్లి మండలం కొత్తకొత్తూరు గ్రామానికి చెందిన అపర మేధావి డాక్టర్ గుగ్గిళ్ళ దివ్యమూర్తికి గురుప్రపూర్ణ జాతీయ అవార్డు లభించింది.ఈ అవార్డు విశాఖపట్నంకి చెందిన అచీవర్స్ ఆర్గనైజేషన్ వారు డాక్టర్ దివ్యమూర్తి ప్రతిభను గుర్తించి ఇవ్వడం జరిగింది.ఈ అవార్డును అనంతగిరి మండల ఎమ్మార్వో హిమబిందు చేతుల మీదుగా డాక్టర్ గుగ్గిళ్ళ దివ్యమూర్తి అందుకోవడం జరిగింది. డాక్టర్ దివ్యమూర్తి లాంటి వ్యక్తులు సమాజానికి ఎంతైనా అవసరమని ఎమ్మార్వో హిమబిందు తెలియజేశారు. తదనంతరం డాక్టర్ దివ్య మూర్తిని ఎమ్మార్వో శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ అవార్డు రావడం తనకు సంతోషంగా ఉందని డాక్టర్ దివ్యమూర్తి తెలియజేశారు. ఇప్పటివరకు తనకు 62 అవార్డులు వచ్చాయని 107 చోట్ల సన్మానం జరిగిందని డాక్టర్ దివ్యమూర్తి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అనంతగిరి మండల తహసిల్దార్ సిబ్బంది, మహేశ్వర నాగేశ్వరరావు, జ్యోత్స్న, జూనియర్ అసిస్టెంట్, సీనియర్ అసిస్టెంట్, తదితరులు పాల్గొన్నారు.


## అన్నపూర్ణ విశ్వేశ్వర స్వామి ఆలయం విగ్రహ ప్రతిష్ట మహెూత్సవం.. దేవాలయంలో విగ్రహ ప్రతిష్ట పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్





అనంతగిరి, మే 14 (శుభోదయం న్యూస్): అనంతగిరి మండలం మొగలాయికోట గ్రామంలో పార్వతి సమేత రామలింగేశ్వర విగ్రహ ప్రతిష్ట మహెూత్సవంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... ఆ పరమశివుని అనుగ్రహంతో ప్రజలు ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని అన్నారు. గ్రామాల్లో ఆలయాలు నిర్మించుకొని ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొనడం వలన ప్రజలందరికీ మంచి జరుగుతుందని తెలిపారు . ప్రతిష్ట మహెూత్సవం లో ప్రజలు తండోపతండాలుగా ఆలయాల జరిగే ఉత్సవాల్లో పాల్గొంటున్నారు. గ్రామం అంతా హర హర మహాదేవ శంభో శంకర అనే కీర్తనలతో మార్మోగి పోయాయి. ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంత లభిస్తుందని ఈ కార్యక్రమంలో మొగలాయికోట మాజీ సర్పంచ్ పోరల్ల ఉమా సత్యనారాయణ టిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు కోండ్రు వెంకటరత్నం శింగారెడ్డి నారాయణరెడ్డి ఎస్ అప్పిరెడ్డి అల్లేబోయిన శివ నూకల శీను పోల్లా పూర్ణ పెళ్లికొడుకు వెంకటేశ్వర్లు తదితరులు మొగలాయికోట బిఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు..

## నూతన వధూవరులను ఆశీర్వదించిన మంగపేట పి ఎస్ సి ఎస్ సొసైటీ చైర్మన్ తోట రమేష్




మంగపేట, మండల రిపోర్టర్ - తులసి (శుభోదయం న్యూస్):ములుగు జిల్లామంగపేట మండలంరాజుపేట గ్రామంవివాహ కార్యక్రమానికి హాజరై నూతన దంపతులను ఆశీర్వదించిన మంగపేట పి ఎస్ సి ఎస్ సొసైటీ చైర్మన్ తోట రమేష్ బుధవారం రోజున మంగపేట మండలంలోని రాజుపేట గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ రాజుపేట గ్రామ యూత్ నాయకుడు గోగులముడి రాజు-రాణి ల వివాహ వేదిక కార్యక్రమానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన, మంగపేట పి ఎస్ సి ఎస్ సొసైటీ చైర్మన్ తోట రమేష్ ఈ కార్యక్రమంలో మాధవరావు సార్, మంగపేట మండల నాయకులు కర్రి శ్రీను,నిమ్మగడ్డ ప్రవీణ్, కత్తిగూడెం గ్రామ సోషల్ మీడియా ఇంచార్జ్ గంధం కిషోర్ మరియు యూత్ నాయకులు జై భీమ్ రామ్మోహన్, గోగులముడి అనిల్ కుమార్ మరియు తదితరులు పాల్గొన్నారు.

## రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో అన్ని గ్రామాలలో సిపిఐ పార్టీ పోటీ చేస్తుంది



వలిగొండ మండల రిపోర్టర్ (శుభోదయం న్యూస్):యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని నర్సాపురం గ్రామంలో శాఖ మహాసభలు ఓర్సు స్వామి అధ్యక్షతన జరిగినది.ఈ మహాసభకు ముఖ్య అతిథులుగా సిపిఐ మండల కార్యదర్శి పోలేపాక యాదయ్య హాజరై మాట్లాడుతూ సంస్థగతంగా అన్ని గ్రామాలలో సిపిఐ పార్టీ గ్రామ శాఖలలో మహాసభలు నిర్వహించుకోవడం జరుగుతున్నది.పార్టీ బలోపేతానికి ఈ మహాసభలు వేదిక కానున్నాయి అని అన్నారు.సంస్థ గతపరంగా గ్రామ శాఖ మహాసభలు నిర్వహించి మండల మహాసభలు నర్సాపురంగ్రామంలో పెద్ద ఎత్తున నిర్వహించబోతున్నామని అన్నారు. ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ఆందోళన ఉద్యమాలు చేయవలసిన అవసరం కూడా ఉందని అన్నారు.రాబోయే స్థానిక ఎన్నికలలో అన్ని గ్రామ శాఖలలో సర్పంచ్,ఎంపీటీసీ జెడ్పీటీసీ స్థానాలకు పోటీ చేయాలని అని అన్నారు. గ్రామాలలో ప్రత్యేక అధికారుల పాలనతో గ్రామాలలో తీవ్రమైన సమస్యలే ఎదురవుతున్నాయి వెంటనే ప్రభుత్వం స్థానిక ఎన్నికలు నిర్వహించాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని కోరారు.అనంతరం నూతన గ్రామ శాఖ ఎన్నుకోవడం జరిగినది కార్యదరిగా నార్కట్పల్లి మచ్చగిరి,సహాయ కార్యదర్శిగా ఓర్సు స్వామి,కార్యవర్గ సభ్యులుగా ఎల్లంకి మహేష్ కూరెల్ల దేవేందర్,వడ్డేపల్లి లక్ష్మమ్మ,లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.

## మే19న జరుగు సుందరయ్య విగ్రహావిష్కరణను జయప్రదం చేయండి : సిపిఎం




వలిగొండ మండల రిపోర్టర్ (శుభోదయం న్యూస్):మే19వ తేదీన భువనగిరిలో ని సిపిఎం జిల్లా కార్యాలయంలో జరుగు సుందరయ్య విగ్రహావిష్కరణ కార్యక్రమం సందర్భంగా జరుగు అమరవీరుల కుటుంబాల ఆత్మీయ సభను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మద్దెల రాజయ్య, మండల కార్యదర్శి సిర్పంగి స్వామి లు కోరారు.బుధవారం మండల పరిధిలోని గోకారం, వలిగొండ గ్రామాల్లో అమరజీవి చెర్కజగన్నాథం,అమరజీవి వేముల మహేందర్ కుటుంబ సభ్యులకు ఆహ్వానాలు అందించిన సందర్భంగా వారు మాట్లాడుతూ దక్షిణ భారతదేశ కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత మొదటి పార్లమెంటు ప్రతిపక్ష నాయకులు పుచ్చలపల్లి సుందరయ్య 40 వ వర్ధంతి సందర్భంగా సిపిఎం జిల్లా కార్యాలయం భువనగిరిలో విగ్రహావిష్కరణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఈ సందర్భంగా సిపిఎం ఉద్యమాల్లో పాల్గొని అసువులు బాసిన త్యాగదనుల స్మరించుకునేందుకు,వారి ఆశయాలకు పునరంకితమై వారి స్ఫూర్తితో మరిన్ని ఉద్యమాలకు శ్రీకారం చుట్టేందుకు ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు,ఈ కార్యక్రమంలో సిపిఎం మండల,జిల్లా కమిటీ సభ్యులు,జిల్లా ప్రజాసంఘాల ఫ్రాక్షన్ కమిటీ సభ్యులు మరియు ఉద్యమంలో డివిజన్ స్థాయిలో, జిల్లా స్థాయిలో పనిచేస్తూ అమరులైన కుటుంబ సభ్యులు పాల్గొంటారని తెలిపారు.ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి వర్గ సభ్యులు తుర్కపల్లి సురేందర్, కూర శ్రీనివాస్, మండల కమిటీ సభ్యులు కవిడే సురేష్,పార్టీ నాయకులు పబ్బు నారాయణ,వేముల లక్ష్మయ్య, పబ్బు నరసింహ, పబ్బు యాదగిరి, దేశపాక బాబు తదితరులు పాల్గొన్నారు.

## మే 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి : సిఐటియు




వలిగొండ మండల రిపోర్టర్ (శుభోదయం న్యూస్):బిజెపి ప్రభుత్వం అధికారులకు వచ్చిన తర్వాత కార్మిక చట్టాలు రద్దు చేస్తూ నాలుగు లేబర్ కోడ్లు తీసుకురావడం జరిగిందని వాటి రద్దుకై ఈనెల 20 న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో కార్మికుల పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి తుర్కపల్లి సురేందర్ మరియు భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు రాధారపు మల్లేశం కార్మికులకు పిలుపునిచ్చారు.బుధవారం వలిగొండ పాత ఎంఆర్ఓ ఆఫీస్ వద్ద సమ్మె వాల్ పోస్టర్ను విడుదల చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులు బ్రిటిష్ ప్రభుత్వ అధికారుల ఉన్న కాలంలో తన ప్రాణాలను త్యాగం చేసి కార్మిక చట్టాలను తీసుకురావడం జరిగింది. కార్మికుల సంఘం పెట్టుకునే చట్టం, కనీస వేతనాలు చట్టం, పీఎఫ్ ఈఎస్ఐ చట్టం, రోజుకు పని గంటల చట్ట0 అనేక చట్టాలు బ్రిటిష్ కాలంలో తీసుకు రావడం జరిగింది. కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలను 29 చట్టాలను రద్దు చేస్తూ మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్లను తీసుకురావడం జరిగింది. కోడ్ ల వల్ల కార్మికులు వందమంది ఉంటేనే సంఘం పెట్టుకునే చట్టంను తీసుకురావడం జరిగింది. దీనివల్ల చిన్న తరహా పరిశ్రమలో పనిచేసే కార్మికులు మన దేశంలో లక్షలాది మంది ఉన్నారు వారు సంఘం పెట్టుకునే హక్కు లేకుండా పోయింది, రోజుకు8గంటలపని విధానం బదులు 12 గంటలవి దానం రాబోతున్న ది కావున ఈ లేబర్ కోడ్ ల రద్దుకై ఈనెల 20న జరిగే సమ్మెలో కార్మికుల పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాల్సిందిగా కోరుతున్నాం. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల నాయకులు కొండే నరసింహ యాదయ్య, శంకర్, నరసింహ, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## లోడే వారి వివాహ వేడుకలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు కైసర్



సంస్థాన్ నారాయణపురం మే 14 (శుభోదయం న్యూస్): యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం జనగాం గ్రామానికి చెందిన చండూరు మార్కెట్ కమిటీ డైరెక్టర్ లోడే రఘు సోదరుడు లోడే రాజు వివాహ వేడుక ఎంబాయి గ్రామానికి చెందిన మనీషా తో హైదరాబాద్ యం.ఇ.రెడ్డి గార్డెన్ లో జరిగింది.ఇట్టి వివాహ వేడుకలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు షేక్ కైసర్ హాజరై వధూవరులకు శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నాతి నరేష్ గౌడ్, పొలగోని వెంకటేశం, మహమ్మద్ ఉస్మాన్ తదితరులు పాల్గొన్నారు.

## వివాహ వేడుకలో పాల్గొన్న టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్ రజాక్



సంస్థాన్ నారాయణపురం మే 14 (శుభోదయం న్యూస్): సంస్థాన్ నారాయణపురం మండలం జనగాం గ్రామానికి చెందిన లోడే సత్తయ్య కుమారుడు లోడే రాజు వివాహ వేడుక హైదరాబాదు యం.ఇ. రెడ్డి గార్డెన్ లో ఏంబాయి గ్రామానికి చెందిన సిద్దగోని యాదగిరి గౌడ్ కుమార్తె మనీషా తో జరిగింది. ఈ వేడుకకు హాజరైన టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి ఉద్యమ నాయకులు మహమ్మద్ రజాక్ వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియచేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో నాయకులు బైకాని శ్రీను,శనిగల జంగయ్య,మంచాల సైదులు, శనిగల సైదులు,జక్కుల మల్లేష్,నాతి శివ గౌడ్,గజవెల్లి వెంకన్న, శనిగల మహేష్,తదితరులు పాల్గొన్నారు.

## భూపని వారి వివాహ వేడుకల్లో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉప్పల లింగస్వామి



సంస్థాన్ నారాయణపురం మే 14 (శుభోదయం న్యూస్): సంస్థాన్ నారాయణపూర్ మండల కేంద్రానికి చెందిన భూపని సంజీవ- చేన్నమ్మ దంపతుల కుమారుడు మల్లేష్- అర్చన( పూజ) నూతన దంపతుల వివాహం శ్రీ వెంకటేశ్వర గార్డెన్ లో వివాహ వేడుకలకు హాజరై నూతన దంపతులను ఆశీర్వదించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉప్పల లింగస్వామి ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కొండ్రెడ్డి నరసింహ, సుర్వి దయాకర్ గౌడ్, భూపని బలరాం, నరసింహ, ఈసం శివకుమార్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఒకే దేశం ఒకే ఎన్నిక పై అవగాహన సదస్సు. ముఖ్య అతిథిగా వన్ నేషన్ వన్ ఎలక్షన్ పెద్దపెల్లి జిల్లా కన్వీనర్ సోమారపు లావణ్య..




రామగుండం మండలం రిపోర్టర్- తిరుపతి, (శుభోదయం న్యూస్) రామగుండం నగర పాలక సంస్థ పరిధిలో ఆద్య ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన ఒకే దేశం ఒకే ఎన్నిక అంశంపై అవగాహన కార్యక్రమంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వన్ నేషన్ వన్ ఎలక్షన్ పెద్దపల్లి జిల్లా కన్వీనర్ సోమరపు లావణ్య విచ్చేయడం జరిగింది వారు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఒకేసారి ఎన్నికలు నిర్వహించడంతో సమయంతో పాటు తక్కువ ఖర్చుతో ఎన్నికల నిర్వహించవచ్చునని తెలిపారు. స్థిరమైన ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు దోహదపడుతుందని , కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వా సఖ్యత పెరిగి అభివృద్ధి జరుగుతుందని



అన్నారు. పెద్దపల్లి జిల్లాలోని వివిధ వర్గాలకు చెందిన విద్యా వేత్తలతో ఒకే నేషన్ ఓకే ఎన్నికపై వారి అభిప్రాయాలను చర్చాగోస్తి ద్వారా వివరించారు. ఈకార్యక్రమంలో కవాటి రాజగోపాల్, సుల్వ లక్ష్మీనారాయణ, కాసిపేట శివజి , పెద్దపల్లి రవీందర్ , మహవధి రామన్న, అడ్వకేట్ సితకరి చంద్రశేఖర్ ,గోపగోయిన నవీన్ , సాగి కిషన్ రావు , కిరణ్ అధిక సంఖ్యలో న్యాయవాదులు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## సర్టిఫికెట్స్ పేరుతో అదనపు వసూళ్లకు పాల్పడే పాఠశాలలపై కఠిన చర్యలు. రామగుండం మండలం విద్యాధికారి గడ్డం చంద్రయ్య



గోదావరిఖని టౌన్ రిపోర్టర్- సురేష్, (శుభోదయం న్యూస్)పదవ తరగతి తర్వాత పై చదువులకు వెళ్లే విద్యార్థులకు స్టడీ, బదిలీ,ఎస్ఎస్సి ఒరిజినల్ సర్టిఫికెట్స్ ఇచ్చే క్రమంలో మరియు ఫెయిర్ వెల్, ఫ్రెషర్స్ పార్టీలకు ప్రైవేట్ పాఠశాలల యజమానులు అక్రమ వసూళ్లు చేస్తున్నట్టు పత్రికాలలో రావడం జరిగింది. ఉత్తీర్ణులైన విద్యార్థులకు సర్టిఫికెట్స్ ఇచ్చే బాధ్యత యాజమాన్యాలకు కలదు.సర్టిఫికెట్స్ ఇష్యూ చేసే క్రమములో ప్రైవేట్ పాఠశాలల యజమానులు అదనంగా డబ్బులు ఇవ్వమని తల్లిదండ్రులపై ఒత్తిడి చేసిన, కంప్లైంట్స్ వచ్చిన సదరు పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోబడును.విద్యార్థుల తల్లిదండ్రులు ఈ విషయములో మిమ్ములను అదనపు డబ్బులు అడిగినా ఇస్తేనే సర్టిఫికెట్ ఇస్తామని ఒత్తిడి చేసిన విద్యాశాఖ దృష్టికి తీసుకు రాగలరు. ఇలాంటి సంఘటనలు మా దృష్టికి వస్తే అట్టి పాఠశాలల గుర్తింపును రద్దు చేయడంతో పాటు చర్యలు తీసుకోబడునని మండల విద్యాధికారి గడ్డం చంద్రయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## మెగా జాబ్ మేళా ను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలి. రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా.



గోదావరిఖని టౌన్, సురేష్, (శుభోదయం న్యూస్) : రిపోర్టర్-నోబెల్ ఎడ్యుకేషనల్ ఎంపవర్మెంట్ అసోసియేషన్ మరియు సింగరేణి కాలరీస్ కంపెనీ ఆధ్వర్యంలో రామగుండం ఏరియా1,2 %డ% 3 ఏరియా పెద్దపల్లి మరియు మంచిర్యాలజిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులు కోసం దాదాపుగా 100 పైగా




కంపెనీలో, 3000పైచిలుకు ఉద్యోగాల కొరకు మెగా జాబ్ మేళా తేది.18-05-2025, ఆదివారం రోజున ఉదయం 8:00గంటల నుండి గోదావరిఖనిలోని జవహర్ లాల్ నెహ్రూ స్టేడియం ప్రాంగణంలో నిర్వహించడం జరుగుతుందని ఇట్టి అవకాశన్ని నిరుద్యోగ యువత సద్వినియోగించుకోవాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా గారు ఒక ప్రకటనలో తెలియజేసారు.ఈ సందర్భంగా రామగుండం కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, ఏసీపి శ్రీ మడత రమేష్, డీసీపీ అడ్మిన్ రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాగవేందర్ రావు, ఆర్ జీ. 1 జిఎం శ్రీ లలిత్ కుమార్, సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్ వీరారెడ్డి గార్లు మెగా జాబ్ మేళా పోస్టర్ ను ఆవిష్కరించడం జరిగింది.

## గోదావరిఖని చౌరస్తాలో నూతన వ్యాపార నిర్మాణ పనులు ప్రారంభం. మక్కాన్ సింగ్ సేవా సమితి చైర్మన్ మనాలి ఠాకూర్.



రామగుండం మండలం రిపోర్టర్ - తిరుపతి, (శుభోదయం న్యూస్): గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో నూతన వ్యాపార నిర్మాణ పనులు బుధవారం రోజున ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అక్కడ ఉన్న స్థానిక వ్యాపారస్తులను కలుసుకుని వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. నిర్మాణ సమయంలో ఎదురయ్యే అసౌకర్యాలను దృష్టిలో ఉంచుకుని రామగుండం శాసనసభ్యులు రాజ్ ఠాకూర్ గారి ఆదేశాల మేరకు తాత్కాలికంగా వారి వ్యాపారాల నిమిత్తంగా ప్రత్యామ్నాయ స్థలాన్ని కేటాయించడం జరిగింది.ఈ కార్యక్రమంలో



శాసనసభ్యులు శ్రీ రాజ్ ఠాకూర్ గారి సతీమణి, మక్కాన్ సింగ్ సేవ సమితి చైర్మన్ శ్రీమతి మనాలి ఠాకూర్ పాల్గొని వ్యాపారస్తులకు ధైర్యం చెబుతూ సహకారాన్ని అందించారు. అలాగే పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ సంపూర్ణ మద్దతును తెలియజేశారు.

## అనుమానస్పద స్థితిలో వ్యక్తి మృతి



వలిగొండ మండల రిపోర్టర్ (శుభోదయం న్యూస్):యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని సంగెం గ్రామంలోనీ అనుమానాస్పదంగా భీమలింగం మూసి వంతెన వద్ద వ్యక్తి మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది ఎస్సై వి యుగేందర్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం సంగెం గ్రామ పంచాయతీ కార్యదర్శి కుకుడాల జితేందర్ రెడ్డి తెలిపిన సమాచారం మేరకు స్థానిక పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మూసి నుండి చనిపోయిన వ్యక్తిని బయటకు తీసి గుర్తించగా భువనగిరి మండలం సింగన్నగూడెం గ్రామానికి చెందిన బేర సురేష్ 45 సంవత్సరాలుగా గుర్తించారు మృతుని మెడపై చుట్టూ గాయాలతో పాటు శరీరంపై అనేక గాయాలు కావడంతో పలు అనుమానాలు తావిస్తుంది,మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామన్నపేట ఏరియా అసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై యుగేందర్ గౌడ్ తెలిపారు.

శుభోదయం

సంపాదకీయం

# పిఓకె మనకు దక్కుతుందా?

## (విశ్లేషణ)

పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను తిరిగి సాధించుకోవాలన్న పట్టుదలతో భారత ప్రభుత్వం ఉంటోంది. పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను (%ఝెంప్రఎఅతీ ర్శీతీఎ% ) అప్పగించడం మినహా మరో విషయం లేదని, అంతకు మించి మాట్లాడేది లేదని స్పష్టం చేసింది. కశ్మీర్ సమస్య పరిష్కారానికి మధ్యవర్తిత్వం వహిస్తామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చొరవ చూపించినా దానికి భారత్ ఒప్పుకోవడం లేదు. ఇందులో ఎవరి మధ్యవర్తిత్వాన్ని కోరుకోవడం లేదని కరాఖండీగా చెప్పింది. చారిత్రాత్మకంగా ఒకప్పుడు కశ్మీర్ రాచరిక రాష్ట్రంలో భాగమైన పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ (పిఓకె)ను 1947లో పాకిస్థాన్ చట్టవిరుద్ధంగా ఆక్రమించింది. 1947లో భారతదేశం స్వాతంత్ర్యం పొందినప్పుడు భారతదేశంలో లేదా పాకిస్థాన్‌లో చేరడం లేదా స్వతంత్రంగా ఉండటం అనే ఎంపికకు పాక్ ఆక్రమిత కశ్మీర్‌కు బ్రిటిష్ వారు అవకాశం కల్పించారు. ఆ సమయంలో జమ్మూకశ్మీర్ పాలకుడు మహారాజు హరిసింగ్ స్వతంత్ర రాజ్యంగా ఉండాలనే హోదాను ఎంచుకున్నారు. అయితే 1947లో పూంచ్‌లో హరిసింగ్ ఆ ప్రాంత రైతులపై విధించిన శిక్షాత్మక పన్నుల కారణంగా తిరుగుబాటు తలెత్తింది. అదే సంవత్సరం అక్టోబర్‌లో వాయువ్య సరిహద్దు ప్రావిన్స్‌కు చెందిన వేలాది మంది పష్టున్ గిరిజనులు మహారాజా పాలన నుంచి జమ్మూకశ్మీర్‌కు విముక్తి కల్పించాలన్న లక్ష్యంతో పాకిస్తాన్ సైన్యం మద్దతుతో పోరాటం సాగించారు. పరిస్థితిని అదుపు చేయడంలో మహారాజా హరిసింగ్ సైన్యం విఫలమైంది. ఫలితంగా తిరుగుబాటుదారులు పూంచ్ జిల్లాలో ఎక్కువ భాగాన్ని తమ అధీనంలోకి తెచ్చుకున్నారు. ముజఫరాబాద్, బారాముల్లాలను స్వాధీనం చేసుకోవడంలో విజయం సాధించారు. ఇక చేసేదిలేక భారత ప్రభుత్వ సహాయాన్ని మహారాజా కోరారు. దానికి భారత ప్రభుత్వం ఒక షరతు విధించింది. భారతదేశంలో జమ్మూకశ్మీర్ విలీనం ఒప్పందానికి అంగీకరిస్తూ సంతకం చేయాలని సూచించింది. దాంతో మహారాజు హరిసింగ్ అంగీకరించారు. జమ్మూకశ్మీర్ రక్షణ, విదేశాంగ వ్యవహారాలు, కమ్యూనికేషన్ నియంత్రణను భారత ప్రభుత్వానికి అప్పగించారు. దీంతో భారత్, పాకిస్తాన్ మధ్య యుద్ధం సంభవించింది. ఫలితంగా రెండు ప్రాంతాలపై స్థిరనియంత్రణ లభించింది. పాకిస్తాన్ మద్దతుగల తిరుగుబాటుదారుల ప్రభావంలో ఉన్న ప్రాంతం పాకిస్తాన్ ఆక్రమిత కశ్మీర్‌గా ఇప్పుడు పిలవబడుతున్నది. పేరుకే స్వయం పరిపాలనా ప్రాంతంగా ఉన్న ఈ ప్రాంతాన్ని పాకిస్తాన్ పరిపాలిస్తోంది. పాకిస్తాన్ ఈ ప్రాంతాన్ని ఆజాద్ కశ్మీర్‌గా వ్యవహరిస్తోంది. దీనికి సరిహద్దులుగా ఉత్తరాన గిల్గిట్ బల్టిస్థాన్ (గిల్గిట్ బల్టిస్థాన్ ఆజాద్ కశ్మీర్‌లో భాగం కాదు). దక్షిణాన పాకిస్తాన్ పంజాబ్, పశ్చిమాన ఖైబర్ పఖ్తూన్‌క్వాలు ఉన్నాయి. తూర్పు వైపున జమ్మూకశ్మీర్ ఉంది. ఈ రెండింటి మధ్య నియంత్రణ రేఖ (ఎల్ఓసి) ఉంది. ఇది భారత, పాకిస్తాన్ మధ్య వాస్తవ సరిహద్దుగా పనిచేస్తుంది. భౌగోళికంగా ఈ భూభాగం మొత్తం వైశాల్యం 13,297 కి.మీ (5134 చదరపు మైళు ). ముజఫరాబాద్ నగరం దీని రాజధాని. 2017 జాతీయ జనాభా లెక్కల ప్రకారం మొత్తం జనాభా 40,45,366. దాదాపు జనాభా అంతా ముస్లింలే. పిఓకెలో పార్లమెంటరీ ప్రజాస్వామ్యం ఉంది. అధ్యక్షుడు రాజ్యాంగబద్ధమైన దేశాధినేత కాగా, ప్రధాన మంత్రి, మంత్రుల మండలి మద్దతుతో కార్యానిర్వాహకత్వం వహిస్తారు. ఏకసభ లెజిస్లేటివ్ అసెంబ్లీ ప్రధాన మంత్రి, రాష్ట్రపతి ఇద్దరినీ ఎన్నుకుంటుంది. స్వంత సుప్రీం కోర్టు, హైకోర్టు ఉన్నాయి. అయితే పాకిస్తాన్ ప్రభుత్వ కశ్మీర్ గిల్గిత్ బాల్టిస్థాన్ వ్యవహారాల మంత్రిత్వశాఖ, పాకిస్థాన్ ప్రభుత్వానికి, పిఓకె ప్రభుత్వానికి మధ్య అనుసంధానంగా పనిచేస్తుంది. అయితే దీనికి పాకిస్తాన్ పార్లమెంట్‌లో ప్రాతినిధ్యం లేదు. పిఓకెలోని ఉత్తరభూభాగం తరచుగా తీవ్ర భూప్రకంపనాలకు గురవుతుంది. 2005లో సంభవించిన భారీ భూకంపం వల్ల లక్షమంది మృతి చెందగా, మరో 30 లక్షల మంది నిరాశ్రయులయ్యారు. దీనివల్ల ఈ ప్రాంతం మౌలిక సదుపాయాలు, ఆర్థిక వ్యవస్థ విధ్వంసమయ్యాయి. వ్యవసాయం, పర్యాటకం, సేవలు పైనే ఈ ప్రాంతం ఆర్థిక వ్యవస్థ ఆధారపడి ఉంది. ఒకవంక పాకిస్తాన్, మరోవంక విదేశీ సాయాలతోనే పిఓకె మనుగడ సాగిస్తోంది. దాదాపు 87% పిఓకె కుటుంబాలకు వ్యవసాయ భూములు ఉన్నాయి. పిఓకెలో ద్రవ్యోల్బణ ఒత్తిడి ఎక్కువగానే ఉంది. దీనికి వ్యతిరేకంగా ఆందోళనలు తలెత్తుతున్నాయి. పాకిస్తాన్ ప్రభుత్వ ఉదారవాద విధానాలు, నిరుద్యోగం, అధిక వలసలు ఇవన్నీ తీవ్ర సమస్యలుగా వెంటాడుతున్నాయి. నిరుద్యోగ రేటు 33% వరకు ఉంది. ఉపాధి కోసం యువత గల్ఫ్‌దేశాలకు వలసపోతున్నారు.గత కొన్ని రోజులుగా పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో అక్కడి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజలు ఆందోళనలు సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను భారత్‌లో విలీనం చేయాలన్న డిమాండ్ పెరుగుతోంది.అసలే ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉండటం, పిఓకెలో ఉన్న వనరులను స్థానిక ప్రజలకు కాకుండా పాక్‌లోని ఇతర ప్రాంతాలకు ప్రభుత్వం తరలించుకుపోతుండడంతో స్థానికుల్లో తీవ్ర అసంతృప్తి పెరుగుతోంది. ఇక్కడి జలవిద్యుత్‌ను పాకిస్థాన్‌లోని ఇతర ప్రాంతాలు, నగరాలకు సరఫరా కోసం తరలిస్తున్నారని స్థానికులు ధ్వజమెత్తుతున్నారు. హక్కుల కోసం ప్రజలు వీధికెక్కుతున్నారు. ఈ పరిణామాలన్నీ పిఓకెపై పాకిస్థాన్ ప్రభుత్వ పట్టుకోల్పోడానికి దోహదం చేస్తున్నాయని నిపుణులు చెబుతున్నారు. ఇవన్నీ గమనించి పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను తమ పాలన లోకి తెచ్చుకోవాలని భారత ప్రధాని మోడీ ఆకాంక్షిస్తున్నారు. అంతేకాదు చర్చల్లో ఇదే ప్రధాన అజెండాగా నిలుస్తోంది.

# కెనడా విదేశాంగ మంత్రిగా భారత బిడ్డ.. ఎవరామె ? ఏంటా స్టోరీ ?



కెనడాలో జరిగిన ఫెడరల్ ఎన్నికల్లో లిబరల్ పార్టీ మరోసారి ఘన విజయం సాధించి అధికారాన్ని దక్కించుకుంది. పార్టీ అధినేత మార్క్ కార్నీ మరోసారి ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేశారు.ఈ క్రమంలోనే మంత్రివర్గ పునర్నిర్మాణంలో భాగంగా అనితా ఆనంద్‌ను విదేశాంగ మంత్రిగా నియమించారు. అయితే ఆమె భారత సంతతికి చెందిన వ్యక్తి కావడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది. ఈ అరుదైన ఘనత రెండోసారి కూడా సాధించడం పట్ల ఆమెను అభినందిస్తున్నారు. కేంద్ర మంత్రి ఎస్. జైశంకర్ సహా పలువురు భారతీయ ప్రముఖులు సోషల్ మీడియా వేదికగా విషెస్ తెలియజేశారు. దీంతో అనితా ఆనంద్ గురించి మన వాళ్లంతా తెగ వెతికేస్తున్నారు.

**ఎవరు ఈ అనితా ఆనంద్..?**

1967 మే 20న నోవాస్కోటియా లోని కెంట్‌విల్లేలో జన్మించారు అనితా ఆనంద్. ఆమె తమిళ, పంజాబీ మూలాల కలిగిన కుటుంబానికి చెందినవారు. తల్లి సరోజ్ దౌలత్‌రామ్ అనస్తీషియాలజిస్ట్ కాగా, తండ్రి సుందరం వివేక్ జనరల్ సర్జన్. ముగ్గురు సోదరీమణుల్లో పెద్దదైన అనితకు గీత, సోనియా అనే ఇద్దరు చెల్లెల్లు ఉన్నారు.

**విద్యాభ్యాసం..**

1985లో ఒంటారియోకి వెళ్లిన అనిత.. రాజకీయ శాస్త్రంలో డిగ్రీ సాధించారు. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ నుంచి న్యాయ శాస్త్రంలో ఆనర్స్ డిగ్రీ, ఆ తర్వాత డల్హౌసీ, టొరంటో యూనివర్సిటీల నుంచి న్యాయశాస్త్రంలో బాచిలర్స్, మాస్టర్స్ పూర్తిచేశారు. లాయర్‌గా ఎన్నో సంవత్సరాలు పనిచేశారు.

**వివాహం..**

1995లో జాన్ నోల్టన్ అనే న్యాయవాదిని అనితా ఆనంద్ వివాహం చేసుకున్నారు. వారికి నలుగురు పిల్లలు ఉన్నారు. ప్రస్తుతం ఆమె కుటుంబంతో కలిసి ఓక్‌విల్లేలో నివసిస్తున్నారు.

పొలిటికల్ ఎంట్రీ..

అనితా ఆనంద్ రాజకీయంగా ఇప్పటికే విశేష అనుభవం పొందారు. 2019లో కెనడా ఫెడరల్ క్యాబినెట్‌లో పనిచేసిన మొదటి హిందూ మహిళగా సైతం గుర్తింపు పొందారు. 2019 నుంచి 2021 వరకు పబ్లిక్ సర్వీసెస్, ప్రొక్యూర్‌మెంట్ మినిస్టర్‌గా పనిచేశారు. అంతే కాకుండా ఆమె కెనడా రక్షణ మంత్రిగా ఉన్న సమయంలో ఉక్రెయిన్‌కు ఆర్థిక ప్యాకేజీని ప్రకటించారు. సాయుధ దళాల్లో లైంగిక వేధింపుల్ని ఆరికట్టి కొత్త సంస్కరణలు తీసుకొచ్చినందుకుగానూ పలు పురస్కారాలు అందుకున్నారు.

ఇక ఇప్పుడు విదేశాంగ శాఖ మంత్రిగా నియమితులయ్యారు. అంతకు ముందు ఆ స్థానంలో మెలానీ జోలీ బాధ్యతలు స్వీకరించారు. అలానే అనితా అనంద్ గతంలో రక్షణ మంత్రిగానే కాకుండా పలు కీలక మంత్రిత్వ శాఖలను కూడా నిర్వహించారు.

భగవద్గీతపై ప్రమాణం..

మరోవైపు ప్రమాణ స్వీకారం సందర్భంగా అనితా ఆనంద్ భగవద్గీతపై చేయి ఉంచి ప్రమాణం చేశారు. గతంలో సైతం ఆమె ఇలానే వ్యవహరించి ప్రశంసలు అందుకున్నారు. అంతే కాకుండా ఎక్స్ వేదికగా.. కెనడా విదేశాంగ మంత్రిగా నియమించబడటం గౌరవంగా భావిస్తున్నానని రాసుకొచ్చారు. ప్రధాన మంత్రి మార్క్ కార్నీ నేతృత్వంలో కెనడియన్లకు సురక్షితమైన ప్రపంచాన్ని నిర్మించేందుకు కృషి చేస్తామని రాసుకొచ్చారు.

# ఆపరేషన్ సింధూర్ కు బ్రేక్ వెనుక షాకింగ్ రీజన్ ? చేతులెత్తేసిన ట్రంప్ ?






పహల్గాం ఉగ్రదాడి తర్వాత పాకిస్తాన్ పీచమణిచేందుకు భారత్ ఆపరేషన్ సింధూర్ చేపట్టింది. తొలుత ఉగ్రశిబిరాల నుంచి మొదలుపెట్టిన ఈ ఆపరేషన్ ఆ తర్వాత పాకిస్తాన్ లోని ఎయిర్ బేస్ లు, మిలిటరీ స్థావరాల వరకూ వెళ్లిపోయింది. ఈ క్రమంలోనే లాహోర్ లోని ఆయుధ రక్షణ వ్యవస్థల్ని సైతం భారత ఆర్మీ కుప్పకూల్చింది. అయితే ఇదంతా ఉధృతంగా సాగుతున్న సమయంలో హఠాత్తుగా భారత్-పాకిస్తాన్ ల తరఫున అమెరికా అధ్యక్షుడు కాల్పుల విరమణ ప్రకటన చేశారు. దీనిపై భారత్ లో సర్వత్రా విమర్శలు వ్యక్తమయ్యాయి. పాకిస్తాన్ పై ఆపరేషన్ సింధూర్ జోరుగా సాగుతున్న సమయంలో అమెరికా మాట విని భారత్ కాల్పుల విరమణ ప్రకటించడం దేశంలో మెజార్టీ జనానికి నచ్చలేదు. ఓవైపు పాకిస్తాన్ గుండెలపై కొట్టామని, తమ మహిళల సింధూరాలు చెరిపేస్తే ఆపరేషన్ సింధూర్ తో ఉగ్రశిబిరాలనే చెరిపేశామని ప్రధాని మోడీ వెల్లడించారు. అయితే కాల్పుల విరమణను మాత్రం ఆయన సమర్ధించుకోలేకపోయారు. ఓవైపు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తానే యుద్ధం ఆపానని పదే పదే చెప్పుకుంటున్నా ప్రధాని మోడీ మాత్రం ఈ విషయాన్ని అస్సలు ప్రస్తావించడం లేదు. అయితే ఆపరేషన్ సింధూర్ ను అర్ధాంతరంగా ఆపేయడం వెనుక పలు సంచలన కారణాలు ఉన్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా భారత్ చేపట్టిన ఆపరేషన్ సింధూర్ ఉధృతంగా సాగుతున్న తరుణంలో పాకిస్తాన్ లోని అణు స్థావరమైన కిరానా హిల్స్ కు సమీపంలోనే ఉన్న సర్గోదా ఎయిర్ బేస్ పైనా మిస్సైళ్ల దాడి చేసింది. వాస్తవానికి ఇది కిరానా హిల్స్ కు సమీపంలోనే ఉంది. కిరానా హిల్స్ నుంచి 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న ముషాఫ్ ఎయిర్ కాంప్లెక్స్ వరకూ భూగర్భ సొరంగాలు ఉన్నట్లు సమాచారం. వీటికి సమీపంలోనే ఉన్న సర్గోదా ఎయిర్ బేస్ పై మిస్సైళ్లు పక్కనే ఉన్న సొరంగంలో ఉన్న అణు వార్ హెడ్లను తాకినట్లు తెలుస్తోంది. ఇలా భారత మిస్సైళ్లు సర్గోదా ఎయిర్ బేస్ ను టార్గెట్ చేసే ప్రయత్నంలో కిరానా హిల్స్ కూ ముషాఫ్ కాంప్లెక్స్ కూ మధ్య ఉన్న భూగర్భ సొరంగాలపై పడి అందులో ఉన్న అణు వార్ హెడ్లను తాకడంతో రేడియేషన్ లీక్ అయినట్లు తెలుస్తోంది. ఇదే భారత్ తన ఆపరేషన్ సింధూర్ కు బ్రేక్ ఇచ్చేందుకు కారణమైనట్లు సమాచారం. అణు ధార్మికత కారణంగా రేడియేషన్ లీక్ అవుతూ పోతే ఆ తర్వాత ఊహించని ఉపద్రవం తప్పదు. అయితే దీన్ని సరిదిద్దాలంటే భారత్ దాడులు ఆపక తప్పదు. ఈ విషయాన్ని ట్రంప్ కు చెప్పిన భారత ప్రధాని మోడీని కాల్పుల విరమణ దిశగా ఒప్పించినట్లు తెలుస్తోంది. మరోవైపు భారత్ పాకిస్తాన్ లోని కిరానా హిల్స్ లో ఉన్న అణు ప్లాంట్ పై దాడి చేసినట్లు అంతర్జాతీయంగా ప్రచారం జరుగుతోంది. దీన్ని భారత ఎయిర్ ఫోర్స్ ఇప్పటికే ఖండించింది. తాము కిరానా హిల్స్ ను టార్గెట్ చేయలేదని తేల్చిచెప్పేసింది. అయితే దీనికి తగ్గర్లో ఉన్న సర్గోదా ఎయిర్ బేస్ పై దాడి చేసే ప్రయత్నంలో జరిగిన అణు రేడియేషన్ లీకేజీ వల్లే భారత్ కాల్పుల విరమణకు అంగీకరించాల్సి వచ్చినట్లు తెలుస్తోంది. అంతే కానీ ట్రంప్ చెబుతున్నట్లు వాణిజ్యం బూచి చూపి భారత్ ను అమెరికా దారికి తెచ్చుకుందన్న వాదన తప్పని అర్దమవుతోంది.

# గోదావరి నది కాలుష్యం:ప్రాణాలకు ప్రమాదం- జీవనదికి పెరిగిన ముప్పు..!!



:భారతదేశంలో రెండో అతిపెద్ద నది,దక్షిణ భారతదేశంలోని ప్రధాన రాష్ట్రాలకు జీవనాడి అయిన గోదావరి నది కాలుష్యం బారిన పడుతోంది.ఈ ప్రభావం తెలంగాణలో ఎక్కువగా కనిపిస్తోంది.ఇటీవల ఇండియన్ ఇన్స్‌టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ హైదరాబాద్ ,సంయుక్తంగా నిర్వహించిన ఒక అధ్యయనం పారిశ్రామిక వ్యర్థాలు, మురుగు నీరు నదిలోకి చేరి జలచరాల జీవనానికి మరియు మానవ ఆరోగ్యానికి తీవ్రమైన ముప్పు కలిగిస్తున్న కొన్ని ప్రాంతాలను గుర్తించింది.

తెలంగాణలో ఆందోళనకర స్థాయికి కాలుష్యం

తెలంగాణలోని గోదావరి తీర ప్రాంతాల్లో కాలుష్యం ప్రమాదకర స్థాయికి చేరింది. ముఖ్యంగా ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్,ఖమ్మం జిల్లాల్లో ఈ ప్రభావం అధికంగా ఉంది. ఈ ప్రాంతాల్లోని కర్మాగారాలు, ప్రభుత్వ రంగ సంస్థలు శుద్ధి చేయని వ్యర్థాలను నేరుగా నదిలోకి విడుదల చేస్తున్నాయి.ఇది బయోకెమికల్ ఆక్సిజన్ డిమాండ్ (%దీూఇ%) స్థాయిలను పెంచుతోంది. భద్రాచలంలో ఈ కాలుష్య సమస్య స్పష్టంగా కనిపిస్తోంది.ఇక్కడ రసాయన మరియు మురుగునీటి కాలుష్యం కారణంగా నది నీరు తరచుగా నల్లగా మారి దుర్వాసన వస్తోంది.పట్టణీకరణ మరియు నదీతీరాలను ఆక్రమించడం కూడా కాలుష్యానికి కారణమవుతున్నాయి.నది పరీవాహక ప్రాంతమంతా అటవీ నిర్మూలన జరగడం కూడా దీనికి తోడైంది. దీని ప్రధాన ఉపనదులైన ప్రాణహిత, ఇంద్రావతి పరిస్థితి కూడా ఇలాగే ఉంది. భారీగా పేరుకుపోయిన పూడిక మరియు నీటి నాణ్యత తగ్గడం జీవనాన్ని ప్రభావితం చేస్తున్నాయి. నదిపై ఆధారపడి జీవిస్తున్న అనేక గ్రామాల ప్రజలు చర్మ సంబంధిత వ్యాధులు, జీర్ణకోశ సమస్యలు వంటి ఆరోగ్య సమస్యలు పెరిగాయని చెబుతున్నారు.కాలుష్య నిబంధనలను ఉల్లంఘిస్తున్న పరిశ్రమలపై చర్యలు తీసుకోవడంలో యంత్రాంగం పటిష్టంగా లేకపోవడంతో అవి యథేచ్ఛగా వ్యవహరిస్తున్నాయి. పదేపదే హెచ్చరికలు చేసినప్పటికీ, అవి చట్టవిరుద్ధంగా వ్యర్థాలను నదిలోకి విడుదల చేయడం సమస్యను మరింత తీవ్రతరం చేస్తోంది.

మహారాష్ట్రలో సేంద్రీయ వ్యర్థాలు, భారీ లోహాల కాలుష్యం

నది ఎగువ భాగంలో ఉన్న మహారాష్ట్రలో, నాసిక్ నుండి పైఠాన్ వరకు సుమారు 300 కిలోమీటర్ల మేర ఇటీవల జరిగిన అంచనాలలో అత్యధిక స్థాయి సేంద్రీయ కాలుష్యం నమోదైంది. ఈ మార్గంలో సేకరించిన నీటి నమూనాలు ప్రమాదకర స్థాయిలో బయోకెమికల్ ఆక్సిజన్ డిమాండ్ (%దీూఇ%) స్థాయిలను కలిగి ఉన్నాయి. ఇది నీటిలోని ఆక్సిజన్ స్థాయిలను తీవ్రంగా తగ్గించి,జలచరాలకు ముప్పు కలిగిస్తోంది.వ్యవసాయ వ్యర్థాలు కూడా కాలుష్యానికి మరో ప్రధాన కారణం.నాసిక్,నాందేడ్ సమీపంలోని పొలాల నుండి ఎరువులు,పురుగుమందులు శుద్ధి చేయకుండా నేరుగా నదిలోకి ప్రవహిస్తున్నాయి.ఔరంగాబాద్, పైఠాన్‌లోని కొన్ని ప్రాంతాలలో భారీ లోహాల కాలుష్యం వెలుగు చూసింది.ఇక్కడ ఇనుము,జింక్,నికెల్,కాపర్ వంటి లోహాల స్థాయిలు తాగునీటి ప్రమాణాలకు మించి ఉన్నాయని గుర్తించారు. నాసిక్ నుండి పైఠాన్ వరకు 300 కిలోమీటర్ల మేర స్థాయిలు 6-36 వరకు ఉన్నాయి. ముఖ్యంగా మత్స్య సంపదపై తీవ్ర ప్రభావం పడుతోంది. భారీగా పేరుకుపోయిన వ్యర్థాల వల్ల చేపల దిగుబడి తగ్గి ఆదాయం పడిపోవడంతో మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. దుర్వాసన వస్తున్న నీటి వల్ల నది సమీపంలోని పుణ్యక్షేత్రాలను సందర్శించే యాత్రికులు, పర్యాటకులు వెనుకంజ వేస్తున్నారని స్థానికులు వాపోతున్నారు.

ఆంధ్రప్రదేశ్ - అత్యంత కలుషితమైన ప్రాంతాల గుర్తింపు

ఆంధ్రప్రదేశ్‌లోనూ కాలుష్య సంక్షోభం తీవ్రంగా ఉంది.ముఖ్యంగా రాజమహేంద్రవరం నుండి ధవళేశ్వరం బ్యారేజ్ వరకు ఉన్న ప్రాంతం భారతదేశంలోనే అత్యంత కలుషితమైన నదీ భాగాలలో ఒకటిగా గుర్తించబడింది. ఆల్గే వృద్ధి, నీటి కలుపు మొక్కలు, శుద్ధి చేయని మురుగునీరు నది సహజ స్థితిని దారుణంగా మార్చేశాయి.నరసాపురంలో చట్టవిరుద్ధంగా మున్సిపల్ వ్యర్థాలను డంప్ చేస్తున్నారనే ఆరోపణలపై నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ విచారణ ప్రారంభించింది. ఇది కాలుష్య స్థాయిలను మరింత పెంచుతోంది. ఇదిలా ఉండగా, పోలవరం ప్రాజెక్ట్ వంటి పెద్ద ఎత్తున చేపట్టిన నిర్మాణ ప్రాజెక్టుల వల్ల నీరు నిలిచిపోతోంది. దీనివల్ల కాలుష్య కారకాలు కొట్టుకుపోకుండా అక్కడే పేరుకుపోతున్నాయి.గతంలో నేషనల్ రివర్ కన్జర్వేషన్ ప్లాన్ వంటి ప్రయత్నాలు చేసినప్పటికీ, నదీతీర రాష్ట్రాల మధ్య సమన్వయం లేకపోవడం,నిబంధనలను స్థిరంగా అమలు చేయకపోవడం వల్ల కాలుష్య స్థాయిలు అధికంగానే ఉన్నాయి.

**జల్ శక్తి చొరవ**

తెలంగాణ,మహారాష్ట్ర,ఆంధ్రప్రదేశ్‌లలో కాలుష్యాన్ని ఎదుర్కోవడానికి కఠినమైన నిబంధనలు, స్థిరమైన వ్యవసాయ పద్ధతులు, మెరుగైన మురుగునీటి శుద్ధి మౌలిక సదుపాయాలు అవసరమని పర్యావరణవేత్తలు నొక్కి చెబుతున్నారు. ఈ నేపథ్యంలో,జల్ శక్తి మంత్రిత్వ శాఖ గోదావరి నది కోసం దీర్ఘకాలిక నిర్వహణ వ్యూహాన్ని రూపొందించడానికి %చీజుజు=×% భాగస్వామ్యంతో మూడేళ్ల అధ్యయనాన్ని ప్రారంభించింది. నది పునరుజ్జీవనం కోసం ఒక సమగ్ర ప్రణాళికను రూపొందించడంపై ఈ అధ్యయనం దృష్టి సారిస్తోంది. 2025-2028 వరకు కొనసాగే ఈ అధ్యయనం ఇంకా ప్రారంభ దశలోనే ఉంది.

## కేబినెట్‌లో భారతీయ- కెనడియన్లకు కీలక శాఖలు



ఒట్టావా : కెనడా ప్రధాని మార్క్ కార్నీ తన క్యాబినెట్‌ను పునర్‌వ్యవస్థీకరించారు. కొత్త కేబినెట్‌లో భారతీయ –కెనడియన్లు అనితా ఆనంద్, మణీందర్ సిద్ధూలు కీలకమైన మంత్రిత్వ శాఖలను పొందారు. మంగళవారం ప్రకటించిన కొత్త కేబినెట్‌లో అనితా ఆనంద్ విదేశాంగ మంత్రిగా, సిద్ధు అంతర్జాతీయ వాణిజ్య మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికలకు ముందు అనితా ఆనంద్ ఆవిష్కరణలు, సైన్స్ మరియు పరిశ్రమల మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. గతంలో రక్షణ మంత్రి సహా పలు పదవులను నిర్వహించారు. ప్రస్తుతం పరిశ్రమల మంత్రిగా బాధ్యతలు చేపట్టిన మెలానీ జోలీ స్థానంలో ఆమె నియమితులయ్యారు. కెనడా విదేశాంగ మంత్రిగా నియమితులవడం తనకు గౌరవంగా ఉందని, కెనడియన్లకు సురక్షితమైన, న్యాయమైన దేశాన్ని అందించేందుకు ప్రధాని కార్న్, తమ బృందంతో కలిసి పనిచేసేందుకు ఎదురుచూస్తున్నానని అనితా ఆనంద్ ఎక్స్‌లో పేర్కొన్నారు. అంతర్జాతీయ వాణిజ్యమంత్రిగా నియమితులవడం జీవితకాల పురస్కారంగా భావిస్తున్నానని ప్రమాణస్వీకారం అనంతరం సిద్ధు ఎక్స్‌లోపేర్కొన్నారు. వాణిజ్యాన్ని వైవిధ్యపరచడానికి, కొత్త ప్రపంచ మార్కెట్లను చేరుకోవడంలో కెనడియన్ వ్యాపారాలకు మద్దతు ఇవ్వడానికి, ఉపాధి కల్పనలో సహాయపడటానికి తనపై వుంచిన విశ్వాసానికి కృతజ్ఞుడినని పేర్కొన్నారు. ఏప్రిల్ చివరి వారంలో జరిగిన కెనడా ఎన్నికల్లో లిబరల్ పార్టీ ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే. కెనడా ప్రధానిగా మార్క్ కార్నీ బాధ్యతలు చేపట్టారు. రెండు వారాల తర్వాత ఆయన కేబినెట్ పునర్‌వ్యవస్థీకరణను ప్రకటించారు.

## భారత్-పాక్ కలిసి డిన్నర్ చేస్తే.. ఉద్రిక్తతలు తగ్గుతాయి: ట్రంప్



**న్యూఢిల్లీ,:** పహల్గామ్‌లో జరిగిన ఉగ్రవాద దాడికి ప్రతీకారంగా.. భారత్ ఆపరేషన్ సిందూర్‌ను చెప్పట్టిన విషయం తెలిసిందే. ఈ ఆపరేషన్‌లో భాగంగా పాకిస్థాన్‌లోని 9 ఉగ్రవాద స్థావరాలపై దాడి భారత్ దాడి చేసింది. ఈ నేపథ్యంలో భారత–పాకిస్థాన్‌ల మధ్య తీవ్ర ఉద్రిక్తతలు చోటు చేసుకున్నాయి. పరస్పరం దాడులు చేసుకున్నాయి. ఈ నేపథ్యంలో రెండు ప్రభుత్వాలు కాల్పుల విరమణ ఒప్పందం చేసుకోవడంతో పరిస్థితులు కాస్త అదుపులోకి వచ్చాయి. కానీ, ఎప్పుడు ఏం జరుగుతుందో అని అంతా భయపడుతున్నారు. అయితే భారత్–పాక్‌ల మధ్య ఉద్రిక్తతలు తగ్గడానికి తానే కారణం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చెబుతున్నారు. తాజాగా భారత్–పాకిస్థాన్ ల మధ్య నెలకొన్న పరిస్థితులు ప్రశాంతంగా మాట్లాడాలి అంటే.. ట్రంప్ ఓ సలహా ఇచ్చారు. భారత్–పాక్ దేశాల అగ్రనేతలు తను ఏర్పాటు చేసే డిన్నర్‌కు హాజరు కావాలని ట్రంప్ పేర్కొన్నారు. ఓ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. భారత్, పాక్‌ల శాంతి చేకూరాలని కాల్పుల విరమణ ఒప్పందం జరిగేలా చేశామని అన్నారు. భారత్, పాక్ రెండు శక్తివంతమైన దేశాలు.. యుద్ధం ఆపితే వ్యాపారాలు చేసుకుందాం అని సలహా ఇచ్చామని తెలిపారు. రష్యా, ఉక్రెయిన్ మధ్య కూడా యుద్ధం ఆపడానికి చర్చలు జరుపుతున్నామని అన్నారు.

## రాష్ట్రపతితో ఆర్మీ ఉన్నతాధికారులు భేటీ



న్యూఢిల్లీ: రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ అనిల్ చౌహాన్ తోపాటు త్రివిధ దళాల అధిపతులు సమావేశమయ్యారు. బుధవారం రాష్ట్రపతి భవన్ లో ద్రౌపది ముర్మును కలిసి, పహల్గామ్ ఉగ్రవాద దాడికి ప్రతీకారంగా నిర్వహించిన ఆపరేషన్ సిందూర్ గురించి వివరించారు. ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో ఆర్మీ ఉన్నతాధికారులతో ముర్ము సమావేశమైన ఫోటోలను రాష్ట్రపతి వర్గాలు సోషల్ మీడియాలో షేర్ చేశారు. "డిఫెన్స్ స్టాఫ్ చీఫ్ జనరల్ అనిల్ చౌహాన్, ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది, ఎయిర్ స్టాఫ్ చీఫ్ ఎయిర్ చీఫ్ మార్షల్ ఎ.పి. సింగ్, నావికాదళ చీఫ్ అడ్మిరల్ దినేష్ కె. త్రిపాఠి, రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలిసి ఆపరేషన్ సిందూర్ గురించి వివరించారు. ఉగ్రవాదంపై భారత్ ప్రతిస్పందనను అద్భుతమైన విజయంగా మార్చిన సాయుధ దళాల శౌర్యం, అంకితభావాన్ని రాష్ట్రపతి ప్రశంసించారు" అని పేర్కొన్నారు.ు

## సోఫియా ఖురేషిపై వివాదాస్పద వ్యాఖ్యలు.. మంత్రికి చీవాట్లు



ఇండోర్: పాక్‌లోని ఉగ్రస్థావరాలపై భారత్ చేసిన ఆపరేషన్ సిందూర్ గురించి కర్నల్ సోఫియా ఖురేష వివరించిన విషయం తెలిసిందే. అయితే మధ్యప్రదేశ్ బిజెపి చెందిన మంత్రి సోఫియా గురించి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. 'వాళ్లు (ఉగ్రవాదులు) మన సోదరీమణుల సిందూరాన్ని తుడిచివేస్తే.. వాళ్ల(ఉగ్రవాదుల) మతానికి చెందిన సోదరిని సైనిక విమానంలో పంపి మోదీజీ పాక్‌కి గుణపాఠం నేర్పించారు' అంటూ మధ్యప్రదేశ్ గిరిజన సంక్షేమ శాఖ మంత్రి విజయ్ షా వ్యాఖ్యానించారు. దీంతో దీనిపై సర్వత్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. మంత్రిని వెంటనే సస్పెండ్ చేయాలి అంటూ.. కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు. ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కూడా ఈ వ్యాఖ్యలను తప్పుబట్టారు. విజయ్ షా వ్యాఖ్యలు సిగ్గు చేటు అని ఆయన అన్నారు. దీంతో మధ్యప్రదేశ్ బిజెపి మంత్రిని పిలిచి చీవాట్లు పెట్టింది. అయితే దీనికి విజయ్ షా వివరణ ఇచ్చారు. ఉగ్రవాదుల చర్యలకు మనసు వికలమై.. అలా మాట్లాడానని అన్నారు. కులమతాలకు అతీతంగా సోషియా చేసిన సేవలకు సెల్యూట్ చేస్తున్నట్లు తెలిపారు. అంతేకానీ.. ఆమెను కించపరచాలనే ఆలోచన కలలో కూడా రాదని, తన మాటలు ఎవరినైనా నొప్పిస్తే.. పదిసార్లు క్షమాపణ చెప్తానని అన్నారు.

## గ్లోబల్ టైమ్స్, జిన్హువా ఎక్స్ ఖాతాలను నిలిపివేసిన భారత్




న్యూఢిల్లీ : నిరాధారమైన ఆరోపణలతో చైనా మీడియా సంస్థల ఎక్స్ ఖాతాలను భారత్ నిలిపివేసింది. చట్టపరమైన అభ్యర్థన మేరకు గ్లోబల్ టైమ్స్ మరియు జిన్హువా ఎక్స్ ఖాతాలు నిలిపివేయబడ్డాయని చైనా మీడియా బుధవారం పేర్కొంది. ఈ అంశంపై వివరణ కోరగా ఎలక్ట్రానిక్స్ మరియు ఐటి మంత్రిత్వ శాఖ స్పందించలేదు. గ్లోబల్ టైమ్స్, జిన్హువా న్యూస్ ఎక్స్ ఖాతాలను తెరిచినపుడు "ఖాతా నిలిపివేయబడింది" అనే మెసేజ్ స్క్రీన్‌పై కనిపిస్తోంది. దేశవ్యాప్తంగా 8,000కు పైగా ఖాతాలను నిలిపివేయాల్సిందిగా ఎక్స్ సంస్థకు 2025 మే 8న భారత ప్రభుత్వం ఉత్తర్వులు పంపిన సంగతి తెలిసిందే. అంతర్జాతీయ వార్తా సంస్థలు మరియు ప్రముఖ ఎక్స్ వినియోగదారుల ఖాతాలకు భారత్‌లో అనుమతిని నిరోధించాలనే డిమాండ్ ఈ ఉత్తర్వుల్లో ఉంది. మే 7న పాకిస్తాన్ సైన్యం భారత యుద్ధ విమానాన్ని కూల్చివేసిందని చైనా మీడియా సంస్థ గ్లోబల్ టైమ్స్ నివేదించిందని చైనాలోని భారత రాయబార కార్యాలయం ఆరోపించింది.

# తక్షణం పార్లమెంట్




ఏప్రిల్ 22న పహల్గాంలో అమాయకులైన టూరిస్టులపై ఉగ్రదాడి, తదనంతరం మే 7న భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌తో భారత పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్తత తీవ్రమై యుద్ధ వాతావరణం ఏర్పడిన నేపథ్యంలో శనివారంనాడు ఇరు దేశాల డిజిఎంఓలు కాల్పుల విరమణ ప్రకటన చేయడం సానుకూల పరిణామం. అయితే, ఆ ప్రకటన సిరా ఆరకమునుపే సరిహద్దు ప్రాంతాల్లో పాక్ కాల్పులకు పాల్పడడం, భారత దళాలు వాటిని తిప్పికొట్టడం వంటి చర్యలతో ఉద్రిక్తత కొనసాగుతూనే వుందని స్పష్టమవుతోంది. సోమవారంనాడు ఇరు దేశాల డిజిఎంఓల మధ్య చర్చలు జరిగినా అవి చాలా ప్రాథమికమైనవే. ఇవి మరింత ముందుకుపోయి సరిహద్దులో సంపూర్ణ శాంతియుత పరిస్థితులు ఏర్పడాలన్నది ప్రజల ఆకాంక్ష. అయితే, అటు పాకిస్థాన్‌లో ముస్లిం ఛాందస శక్తులు చెప్పినట్టు ఆడే ప్రభుత్వం, ఇటు భారత్‌లో హిందుత్వ శక్తుల నేతృత్వంలోని సర్కారు వున్న నేపథ్యంలో ఆ ఆకాంక్ష ఎంతవరకు నెరవేరుతుందో మరి! ఏది ఏమైనప్పటికీ అది ఏ రూపంలో వున్నా ఉగ్రవాదాన్ని తుదముట్టించాల్సిందే! ఇరు దేశాలమధ్య కాల్పుల విరమణ ప్రకటన రావడానికి ముందే అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఈ విషయాన్ని వెల్లడించడంతో కీలకమైన ద్వైపాక్షిక వివాదంలో అగ్ర రాజ్యం పెత్తనం బట్టబయలైంది. 'మధ్యవర్తిత్వం చేశాం. ఒక రాత్రంతా సుదీర్ఘ చర్చలు జరిపాం' అంటూ ట్రంప్ చేసిన ప్రకటనపై విమర్శలు వెల్లువెత్తుతుండగానే ఆదివారం మరో వివాదాస్పద పోస్టు చేశారు. తాజా పోస్టులో ఆయన కాశ్మీర్ సమస్య పరిష్కారం కోసం కృషిచేస్తానని పేర్కొనడం మరింత వివాదాస్పదంగా మారింది. ద్వైపాక్షిక అంశంలో అమెరికా జోక్యం అంతటా చర్చనీయాంశంగా మారింది. ఇంటా బయటా ఈ విషయమై విమర్శలు వెల్లువెత్తడంతో భారత ప్రభుత్వం నష్ట నివారణ చర్యలకు పూనుకున్నట్లు కనిపిస్తోంది. ఆదివారంనాడు సైనిక దళాల ప్రధానాధికారి (సిఒఎఎస్) సమీక్షించి, పాకిస్తాన్ ఒప్పంద ఉల్లంఘనలకు పాల్పడిన పక్షంలో తగిన చర్యలు తీసుకునేందుకు సైనిక కమాండర్లకు పూర్తి అధికారాలు అప్పగించారన్న ప్రకటన చేశారు. ఈ నేపథ్యంలో జరిగిన అత్యున్నతస్థాయి సమావేశంలో ప్రధాని మోడీ ఆపరేషన్ సిందూర్‌తో పాటు పిఒకె అంశాన్ని కూడా ప్రస్తావిస్తూ పలు కీలక వ్యాఖ్యలు చేశారని ప్రభుత్వ వర్గాలు మీడియాకు తెలిపాయి. ఆ వర్గాలు చెప్పిన సమాచారం ప్రకారం 'అటు నుండి తుపాకి గుళ్లు వస్తే.. ఇటు నుండి మిస్సైల్స్ ప్రయోగించాలి అని మోడీ చెప్పారు. పాక్ ఆక్రమిత కాశ్మీర్ అంశంపై మధ్యవర్తులు అవసరం లేదు' అని అన్నారనీ, ఆక్రమిత కాశ్మీర్‌ను భారత్‌కు అప్పగించడం మినహా పాకిస్తాన్‌కు మరో మార్గం లేదనీ ప్రధాని ఈ సమావేశంలో అన్నారని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. 'ఆపరేషన్ సిందూర్ ఇంకా ముగిసి పోలేదు. పాక్ దాడికి దిగితే, భారత్ ఎదురు దాడి చేస్తుంది.' అని ఆయన అన్నారని మీడియాకు వెల్లడించారు. సోమవారం రాత్రి జాతినుద్దేశించి చేసిన ప్రసంగంలోనూ గంభీర వచనాలే! ఇన్ని మాటలు చెప్పిన ప్రధాని లేదా భారత విదేశాంగ శాఖ అమెరికా జోక్యం గురించి స్పష్టం చేయకపోవడం వాస్తవాలను దాచిపెట్టడం, తద్వారా ప్రజలను వంచించడమే అవుతుంది. ఇప్పటికైనా భారత ప్రభుత్వం ఈ విషయంలో జరిగిందేమిటో ముఖ్యంగా అమెరికా పాత్ర ఏమిటో నిజాలు వెల్లడించాలి. భారత్ పాక్ మధ్య ద్వైపాక్షిక అంశాలను ఇరు దేశాలే పరిష్కరించుకుంటాం తప్ప మూడోవారి జోక్యాన్ని అనుమతించబోమని ఎన్నో దశాబ్దాలుగా అనుసరిస్తున్న విధానానికి కట్టుబడి వ్యవహరిస్తామని దేశ ప్రజలకు హామీనివ్వడం అవసరం. ఈనాడున్న విపత్కర పరిస్తితులపై దేశ ప్రజలందరికీ ఉమ్మడి అభిప్రాయం ఏర్పడడం అవసరం. అందుకు ప్రజాస్వామ్యంలో అత్యున్నత వేదిక పార్లమెంటు కనుక కేంద్ర ప్రభుత్వం వెంటనే పార్లమెంటు అత్యవసర సమావేశం నిర్వహించాలి. అన్ని విషయాలూ సమగ్రంగా చర్చించాలి. జమ్ము కాశ్మీర్‌తో సహా దేశ ప్రజలంతా ఉగ్రవాదాన్ని ఏకోన్ముఖంగా వ్యతిరేకించిన నేపథ్యంలో ఆ ఐక్యతను మరింత పెంపొందించే విధంగా ప్రభుత్వం వ్యవహరించాలి తప్ప స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం చూడరాదన్నది ప్రజల ఆకాంక్ష.

# రిజర్వేషన్లపై కులగణన ప్రభావం



భారత దేశంలో బ్రిటిష్ పాలనా కాలం నుండే జనాభాను లెక్కించడం మొదలైంది. 1881లో మొదలైన జనగణన ప్రతి పదేళ్ళకోసారి లెక్కించడం జరుగుతున్నది. 1931 జనగణన వరకు కులాల వివరాల్ని కూడా సేకరించేవారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత 1951లో జరిగిన జనగణన నుండి షెడ్యూల్డు కులాలు, తెగల వారిని మినహాయించి మిగిలిన కులాల వివరాల్ని నమోదు చేయడం లేదు. 2021 లో జరగాల్సిన జనగణన కరోనా మహమ్మారి వల్ల జరగలేదు. వివిధ రాష్ట్రాలో అసెంబ్లీ ఎన్నికలు, తదనంతరం లోక్‌సభ ఎన్నికలు జరగడంతో జనాభా లెక్కలు వాయిదా పడుతూ వచ్చాయి. దేశవ్యాప్తంగా జనగణనతో పాటు కులగణన కూడా చేయాలని కాంగ్రెస్ పార్టీతో సహా అన్ని ప్రతిపక్ష పార్టీలు డిమాండ్ చేస్తూ వస్తున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్రం అనూహ్యంగా జనాభా లెక్కలతోపాటు కులగణన కూడా చేయనున్నట్లు ప్రకటించింది. జనాభా లెక్కలు అనే అంశం భారత రాజ్యాంగంలోని కేంద్ర జాబితాలో పేర్కొనబడిన అంశం కాబట్టి కేంద్రమే సమగ్రంగా జనగణన చేస్తామని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ ప్రకటించారు. భారత దేశమంటే భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక. వివిధ మతాలు, కులాలు, ప్రాంతాలు, భాషలు, సంస్కృతులు, ఆచార వ్యవహారాలు ఎన్ని ఉన్నా మనమంతా భారతీయులమనే భావన ఇక్కడి ప్రజల్లో బలంగా ఉంటుంది. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత జరిగే ఎనిమిదో జనగణన ఇది. దీంట్లో కులాలవారీగా వివరాల్ని సేకరించడం ద్వారా దేశంలో ఉన్న 28 రాష్ట్రాలు, 8 కేంద్ర ప్రాంత పాలిత ప్రాంతాల్లో ఆయా సామాజిక వర్గాల్లోని కులాల జనాభాతోపాటు వారి సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులు, విద్య, ఉద్యోగ ఉపాధి అవకాశాల్లో వారి వాటా కూడా తెలిసే అవకాశం ఉంటుంది. దేశంలో జనాభాను ఒసి, బిసి, ఎస్‌సి, ఎస్‌టి సామాజిక వర్గాలుగా వర్గీకరించారు. అయితే ఒక్కో కులం, ఒక్కో రాష్ట్రంలో, ఒక్కో వర్గంలో ఉంటుంది. వివిధ రాష్ట్రాల్లో ఆయా కులాల సామాజిక, ఆర్థిక వెనకబాటు ఆధారంగా ఈ విధంగా వర్గీకరించబడ్డాయని చెప్పవచ్చు. ఒక రాష్ట్రంలో ఒక సామాజిక వర్గం ఒసి జాబితాలో ఉంటే మరో రాష్ట్రంలో బిసి జాబితాలో చేర్చబడింది. ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌లో 1976 వరకు బిసి జాబితాలో ఉన్న కొన్ని కులాల్ని ఎస్‌టి జాబితాలోకి చేర్చడం జరిగింది. ఇప్పటికీ చాలా కులాలు తమను బిసి, ఎస్‌సి, ఎస్‌టిల జాబితాలో చేర్చాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్ని డిమాండ్ చేస్తున్నాయి. జనాభా లెక్కలతోపాటు కులాల వారీగా వివరాల్ని సమగ్రంగా సేకరించడం వల్ల దేశవ్యాప్తంగా ఏయే కులాలు సామాజిక, ఆర్థిక, రాజకీయ వెనకబాటుకు గురయ్యాయో తెలుసుకునే అవకాశం ఉంటుంది. దీని ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూపొందించే సంక్షేమ పథకాలకు అర్హులైన లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరిగే వీలుంటుంది. గత లోక్‌సభ ఎన్నికల్లో దేశ వ్యాప్తంగా కులగణన జరపాలని పెద్ద ఎత్తున కాంగ్రెస్ ప్రచారం చేసింది. తాము అధికారంలోకి వస్తే రిజర్వేషన్ పరిమితిని తొలగిస్తామని కూడా చెప్తోంది. దేశవ్యాప్తంగా పౌరులందరికీ విద్య, ఉద్యోగావకాశాలతోపాటు, సామాజిక, ఆర్థిక, రాజకీయ సమానత్వాన్ని కల్పించడం రిజర్వేషన్ ముఖ్య ఉద్దేశంగా చెప్పవచ్చు. 2011 జనగణన ప్రకారం దేశంలో ఎస్‌సి సామాజిక వర్గజనాభా 16.6% అయితే వారికి 15% రిజర్వేషన్, ఎస్‌టి జనాభా 8.6% అయితే వారికి 7.5% రిజర్వేషన్ అమలవుతుంది. ఒబిసి జాబితాలో ఉన్న వారికి 27% రిజర్వేషన్ అమలు అవుతుంది. అయితే ఒబిసి జనాభా ఒక్కో రాష్ట్రంలో ఒక్కోలా ఉంది. పేదరికానికి కులం, వర్గంతో సంబంధం లేదని 2019 లో కేంద్ర ప్రభుత్వం ఒసిల్లోని పేదల కోసం ఎస్‌సి, ఎస్‌టి, బిసి వర్గాల రిజర్వేషన్ ప్రయోజనాలకు నష్టం వాటిల్లకుండా 103 వ రాజ్యాంగ సవరణ ద్వారా ఇడబ్ల్యుఎస్ చట్టం తీసుకువచ్చి 15(6), 16(6) ఆర్టికల్స్ ప్రకారం 10% రిజర్వేషన్‌ను కల్పించింది. దీంతో దేశంలోని ఒసి, బిసి, ఎస్‌సి, ఎస్‌టి వర్గాల్లో అర్హులైన ప్రతి వ్యక్తికి రాజ్యాంగబద్ధంగా రిజర్వేషన్ ఫలాలు దక్కేందుకు అవకాశం ఏర్పడింది.రిజర్వేషన్ అనే అంశం సమాజంలోని సామాజిక న్యాయం, సమానత్వం, చట్టపరమైన పరిమితుల మీద ఆధార పడి ఉంటుంది. ఈ అంశం పై భారత సుప్రీంకోర్టు 1992లో ఇందిరా సాహ్నీ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో 50% పరిమితిని నిర్దేశించింది. తెలంగాణలో కాంగ్రెస్ 2023 ఎన్నికల్లో బిసిలకు కామారెడ్డి డిక్లరేషన్‌లో 42% రిజర్వేషన్ హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చిన తర్వాత తెలంగాణ వ్యాప్తంగా కులగణన నిర్వహించి రాష్ట్ర జనాభా 3.70 కోట్లని తెలిపింది. దేశంలో రిజర్వేషన్ పెంపు అంశం తెర మీదకు వచ్చినపుడు అందరికీ తమిళనాడులో అమలవుతున్న రిజర్వేషన్ విధానం గుర్తుకు వస్తుంది. కానీ అక్కడ ఈ అంశాన్ని రాజ్యాంగంలోని 9 వ షెడ్యూల్‌లో చేర్చడం వల్ల న్యాయ సమీక్షకు అతీతంగా మారింది. 2007లో వచ్చిన ఐ.ఆర్ కోయల్హో కేసులో సుప్రీం కోర్టు తీర్పు చెబుతూ 9 వ షెడ్యూల్‌లో చేర్చిన అంశాలు రాజ్యాంగ మౌలిక స్వరూపానికి విరుద్ధంగా ఉండరాదని, అవి న్యాయ సమీక్షకు అతీతం కావని పేర్కొంది. రిజర్వేషన్ పెంపు అంశం కేంద్ర పార్లమెంటు అధికార పరిధిలో రాజ్యాంగ సవరణతో ముడిపడి ఉంటుంది. దేశవ్యాప్తంగా జనగణనతో పాటు కుల గణన కూడా నిర్వహించనున్నట్లు కేంద్రం ప్రకటించిన నేపథ్యంలో ఈ ప్రభావం రిజర్వేషన్ల పై ఏ విధంగా ఉండబోతుందో అన్నదానికి కాలమే సమాధానం చెప్తుంది.




# వాణిజ్యమే ట్రంప్ కార్డ్!



మొత్తానికి భారత్– పాకిస్తాన్ ఘర్షణకు తెరదించిన ఘనతను అగ్రరాజ్యాధినేత డొనాల్డ్ ట్రంప్ తన ఖాతాలో వేసుకున్నారు. 'ఇరు దేశాలు కాల్పుల విరమణకు అంగీకరించాయి. ఇందుకు అమెరికా మధ్యవర్తిత్వం వహించింది. సరైన సమయంలో విజ్ఞతతో, తెలివిగా వ్యవహరించినందుకు రెండు దేశాలకూ ధన్యవాదాలు' అంటూ తన ట్రూత్ సోషల్‌లో ట్రంప్ చేసిన పోస్ట్ సభ్యదేశాలనే కాదు, మన దేశంలోని రాజకీయ పక్షాలను కూడా ఆశ్చర్యంలో ముంచెత్తింది. భారత్– పాకిస్తాన్ ఘర్షణలో తలదూర్చబోమంటూ కాల్పుల విరమణకు సరిగ్గా రెండు రోజుల ముందు అమెరికా ఉపాధ్యక్షుడు స్వయంగా చేసిన ప్రకటన ఏ గాలికి కొట్టుకుపోయిందో తెలియదు. ట్రంప్ ప్రకటన వెలువడిన కాసేపటికే అమెరికా విదేశాంగ మంత్రి సైతం తాము ఇరు దేశాల ప్రధానులతోను, జాతీయ భద్రతా సలహాదారులతోనూ చర్చలు జరిపినట్లు పేర్కొన్నారు. ఉద్రిక్తతలకు తెరదించని పక్షంలో ఇరు దేశాలతో వాణిజ్యం నిలిపేస్తానంటూ తాను తేల్చిచెప్పడంతోనే అవి దిగివచ్చాయని, వాణిజ్యాన్ని తాను వాడినట్లుగా ఇతరులెవరూ వాడలేదని ట్రంప్ చెప్పుకున్నారు. నిజమే, వియ్యానికైనా, కయ్యానికైనా వాణిజ్యమే ఆయనకు ట్రంప్ కార్డు. ఇప్పుడు అదే కార్డును ఉపయోగించి, భారత్– పాక్‌లతో వాణిజ్య సంబంధాలు బలోపేతం చేసుకోబోతున్నారు. స్వదేశాన్ని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ఆయన సామ దాన భేద దండోపాయాలన్నీ ప్రయోగిస్తున్నారు. సుంకాల కొరడా ఝుళిపించి, అనేక దేశాలను వాణిజ్య చర్చలకు రప్పించేలా చేయగలిగారు. రష్యాతో యుద్ధానికి కాలు దువ్వుందంటూ ఉక్రెయిన్‌ను తప్పుబట్టి, ఇప్పటివరకూ అమెరికా అందిస్తున్న సహాయాన్ని నిలిపివేస్తామంటూ బెదిరించి, ఆ దేశంలో అరుదైన ఖనిజాల తవ్వకాన్ని గుత్తకు తీసుకున్నారు. కాల్పుల విరమణ తమకు అంగీకారమేనంటూ రష్యా– ఉక్రెయిన్ చేసిన తాజా ప్రకటన దరిమిలా, ఈ ఘనత కూడా ట్రంప్ ఖాతాలోనే పడటం ఖాయంగా కనిపిస్తోంది. అదే జరిగితే, రష్యాతోనూ ఆయన నేరుగా వాణిజ్య ఒప్పందాలకు ఎగబడతారనడంలో సందేహం లేదు. కొత్త బిచ్చగాడు పొద్దెరగడన్నట్లు అధికార పగ్గాలు చేపట్టిందే తడవు దేశదేశాలనూ బెదిరించి మరీ వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకోవడం పనిగా పెట్టుకున్న ట్రంప్ మహాశయుడు చైనా కొమ్ములు మాత్రం వంచలేకపోయారు. దాంతో బతిమాలి, బుజ్జగించి బీజింగ్‌ను దారికి తెచ్చుకున్నట్లు తాజా పరిణామాలను బట్టి తెలుస్తోంది. పోటాపోటీగా విధించుకున్న సుంకాలను తగ్గించుకునేందుకు ఇరుదేశాల మధ్య స్విట్జర్లాండ్ వేదికగా అంగీకారం కుదరడానికి ట్రంప్ ఓ మెట్టు దిగిరావడమే కారణం. రేపోమాపో ఇరాన్‌తోనూ ఇదే విధంగా ఆయన వాణిజ్య ఒప్పందాలను ఖరారు చేసుకున్నా ఆశ్చర్యపోనక్కరలేదు. అణు ఒప్పందానికి తలొగ్గాలని, లేనిపక్షంలో ఏకాకిని చేసి, ఏ సహాయమూ అందకుండా చేస్తామంటూ ఆ దేశాన్ని దారికి తెచ్చుకునేందుకు అమెరికా కుయుక్తులు పన్నుతోంది. విచిత్రమేమంటే, ఈ ఘర్షణలో ట్రంప్ మహాశయుడు భారత్‌తో సమానంగా పాకిస్తాన్‌ను చూడటం. ఉగ్రవాదానికి పాకిస్తాన్ పాలుపోసి పెంచిందన్న నగ్నసత్యం ఆయనకు తెలియనిదేమీ కాదు. ట్విన్ టవర్స్‌పై దాడికి మూలకారకుడైన ఒసామా బిన్ లాడెన్‌కు ఆశ్రయమిచ్చి ఆదుకున్నది దాయాది దేశమే. పాకిస్తాన్‌లో శిక్షణ పొందిన ఉగ్రవాదులు ప్రపంచవ్యాప్తంగా విస్తరించి, తమ కార్యకలాపాలు కొనసాగిస్తున్నారన్నది చేదు నిజం. పహల్గాంలో అమాయక ప్రజల ప్రాణాలు తీసింది కూడా పాక్ ఉగ్రవాదులే. ఇవన్నీ తెలిసినా ప్రస్తుత ఘర్షణలో భారత్‌కు ఎంత ప్రాధాన్యమిచ్చారో అంతే ప్రాధాన్యాన్ని పాకిస్తాన్‌కూ ఇవ్వడం వెనుక కారణాలు వేరు. క్రమక్రమంగా చైనా గుప్పిట్లోకి వెళ్లిపోతున్న దాయాది దేశాన్ని మళ్లీ తన అధీనంలోకి తెచ్చుకోవడం, వీలైతే అప్పులిచ్చి 'ఆదుకోవడం' ఆయన ప్రధాన వ్యూహంగా కనబడుతున్నది. భారత్ వద్దు వద్దంటున్నా పాకిస్తాన్‌కు అంతర్జాతీయ ద్రవ్యనిధి తాజాగా బిలియన్ డాలర్ల ఆర్థిక సహాయం చేయడం వెనుక అమెరికా హస్తం ఉందన్న వార్తలు కూడా వినవస్తున్నాయి. ఇది చాలదన్నట్లు కశ్మీర్ విషయంలోనూ మధ్యవర్తిత్వం నెరిపేందుకు ట్రంప్ ఉత్సాహపడుతున్నారు. ఇరుదేశాలకు చెందిన ఈ వివాదంలో ఇతరుల జోక్యం సహించేది లేదంటూ భారత్ పదేపదే తెగేసి చెబుతున్నా, పట్టించుకోకపోవడం ట్రంప్ తెంపరితనానికి నిదర్శనం. ఒకప్పటిలా పాకిస్తాన్‌తో అంటకాగాలని అగ్రరాజ్యం ఆశిస్తే, ఆసియాలో ప్రబల ఆర్థిక శక్తిగా చైనాకు పోటీగా ఎదుగుతున్న భారత్‌ను దూరం చేసుకున్నట్లే. అదే జరిగితే చైనాను దీటుగా ఎదుర్కొనేందుకు ఆసియాలో పాగా వేయాలన్న అమెరికా కల నెరవేరడం జరగని పని.

# మహిళలు రాఫెల్‌ను నడిపినపుడు.. ఆ పోస్టులు ఎందుకు కేటాయించరు



న్యూఢిల్లీ : భారత వైమానిక దళంలో మహిళలు రాఫెల్ యుద్ధ విమానాన్ని నడపగలిగినపుడు, వారిని ఆర్మీలోని జడ్జి అడ్వకేట్ జనరల్ (లీగల్) పోస్టుల్లో ఎందుకు తీసుకోవడం లేదని సుప్రీంకోర్టు బుధవారం కేంద్రాన్ని నిలదీసింది. ఈ పోస్టుల్లో మహిళలు తక్కువగా ఉండటంపై సుప్రీంకోర్టు విస్మయం వ్యక్తం చేసింది. ఈ పోస్టులకు 50-50 నిబంధన వర్తించినప్పటికీ మహిళలను ఎందుకు నియమించలేదని ప్రశ్నించింది. ఇద్దరు మహిళా అధికారులు అష్నూర్ కౌర్, ఆస్థ త్యాగిలు దాఖలు చేసిన పిటిషన్‌పై మే 8న జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ మన్మోహన్‌లతో కూడిన ధర్మాసనం తమ తీర్పును రిజర్వ్ చేసింది. ఆ ఇద్దరు అధికారులు ఆర్మీలోని జడ్జి అడ్వకేట్ జనరల్ లీగల్ పోస్టుల కోసం నిర్వహించిన పరీక్షల్లో వరుసగా 4,5 ర్యాంకులు సాధించారు. పురుషుల కన్నా మెరిట్ ఎక్కువగా ఉన్నప్పటికీ, మహిళలకు కేటాయించిన ఖాళీలు తక్కువగా ఉండటం వలన జెఎజి విభాగానికి తమను ఎంపిక చేయలేదని పిటిషన్‌లో పేర్కొన్నారు. మహిళలు మరియు పురుషులకు అసమానంగా ఉన్న ఖాళీలను ఈ పిటిషన్‌లో సవాలు చేశారు. మొత్త ఆరు పోస్టుల్లో మహిళలకు మూడు ఖాళీలు మాత్రమే ఉన్నందున వారిని ఎంపిక చేయలేమని అధికారులు చెప్పారని అన్నారు. భారత వైమానిక దళంలో ఒక మహిళ రాఫెల్ యుద్ధ విమానం నడపడానికి అనుమతి ఉంటే, జెఎజిలో ఎక్కువ మంది మహిళలను అనుమతించడం ఆర్మీకి కష్టం ఏముందని కేంద్రాన్ని ప్రశ్నించింది. లింగబేధంతో సంబంధం లేకుండా తటస్థ పోస్టులైనప్పటికీ.. మహిళలకు ఎందుకు తక్కువ పోస్టులు కేటాయించారని ప్రశ్నించింది. పురుషులు-మహిళలు ఆధారంగా ఖాళీలను విభజిచడం వలన అధిక అర్హత కలిగిన మహిళా అభ్యర్థులను తీసుకోనపుడు.. పోస్టులను లింగ తటస్థ పోస్టులను ఎందుకు పిలుస్తారని ధర్మాసనం ప్రశ్నించింది. 10మంది మహిళలు జెఎజికి అర్హత సాధిస్తే..వారందరినీ జెఎజి బ్రాంచ్ అధికారులుగా నియమిస్తారా అని జస్టిస్ మన్మోహన్ ప్రశ్నించారు.

# తెలుగు రాష్ట్రాల్లో భిన్న వాతావరణ పరిస్థితులు




అమరావతి : రెండు తెలుగు రాష్ట్రాల్లో భిన్న వాతావరణ పరిస్థితులు నెలకొన్నట్లు వాతావరణశాఖ పేర్కొంది. ఉత్తర దక్షిణ ద్రోణి ప్రభావంతో ఉపరితల చక్రవాక ఆవర్తనాల ప్రభావంతో తెలంగాణలో వర్షాలు పడతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. తెలంగాణ జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉందని, పశ్చిమ జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసినట్లు వాతావరణశాఖాధికారి ధర్మరాజు తెలిపారు. రుతుపవనాల ఆగమనంతో గత రెండు రోజులుగా నికోబార్ దీవుల్లో వర్షాలు పడుతున్నాయని తెలిపారు. రాష్ట్రంలో కొన్నిచోట్ల పిడుగులతో కూడిన భారీ వర్షాలు, మరికొన్ని చోట్ల ఎండల ప్రభావం చూపే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ ఎమ్‌డి రోణంకి కూర్మనాథ్ తెలిపారు. వాతావరణ మార్పుల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ నెల 14న అల్లూరి సీతారామరాజు, పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి, వైఎస్ఆర్, శ్రీసత్యసాయి, అన్నమయ్య జిల్లాల్లో పలుచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, అంబేద్కర్ కోనసీమ, పల్నాడు, గుంటూరు, ఎన్‌టిఆర్ జిల్లాల్లో అక్కడక్కడా పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందన్నారు. గంటకు 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందన్నారు.ు

# సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ బి.ఆర్.గవాయి ప్రమాణస్వీకారం



న్యూఢిల్లీ : భారత 52వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయి ప్రమాణస్వీకారం చేశారు. బుధవారం రాష్ట్రపతి భవన్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆయనతో సిజెఐగా ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం సిజెఐ గవాయిని రాష్ట్రపతి ముర్ము, ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖర్, ప్రధాని మోడీ, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాతో పాటు కేంద్ర మంత్రివర్గంలోని పలువురు అభినందించారు. ఈ కార్యక్రమానికి మాజీ చీఫ్ జస్టిస్ సంజీవ్ ఖన్నా కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా చీఫ్ జస్టిస్ గవాయికి ఆయన శుభాకాంక్షలు తెలిపారు. సిజెఐగా జస్టీస్ గవాయి ఆరునెలల పాటు పదవిలో కొనసాగుతారు. ఈ ఏడాది నవంబర్‌లో ఆయన పదవీవిరమణ చేయనున్నారు. బాంబే హైకోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ ప్రారంభించిన ఆయన 1985లో బార్‌లో చేరారు. 2003లో బాంబే హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా, 2005లో శాశ్వత న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2019లో సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు.

# యుపిఎస్సీ ఛైర్మన్‌గా మాజీ రక్షణ కార్యదర్శి అజయ్ కుమార్



ఢిల్లీ: యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యుపిఎస్సీ) ఛైర్మన్‌గా మాజీ రక్షణ కార్యదర్శి అజయ్ కుమార్‌ను నియమిస్తూ కేంద్ర సిబ్బంది మంత్రిత్వ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఏప్రిల్ 29న ప్రీతి సుడాన్ పదవీకాలం ముగియడంతో యుపిఎస్సీ ఛైర్మన్ పదవి ఖాళీ కానుంది. ఈ పదవికి అజయ్ కుమార్ నియామకాన్ని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మంగళవారం ఆమోదించినట్లు ఉత్తర్వులలో పేర్కొన్నారు. కేరళ కేడర్‌కు చెందిన 1985 బ్యాచ్ రిటైర్డ్ ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ (ఐఎఎస్) అధికారి అయిన అజయ్ కుమార్ 2019 ఆగస్టు 23 నుండి 2022 అక్టోబర్ 31 వరకు రక్షణ కార్యదర్శిగా పనిచేశారు. ఐఏఎస్, ఇండియన్ ఫారిన్ సర్వీస్ (ఐఎఫ్ఎస్), ఇండియన్ పోలీస్ సర్వీస్ (ఐపిఎస్) వంటి వాటికి అధికారులను ఎంపిక చేయడానికి యుపిఎస్సీ సివిల్ సర్వీసెస్ పరీక్షలను నిర్వహిస్తుంది. దీనికి ఒక ఛైర్మన్ నాయకత్వం వహిస్తారు. దీనిలో గరిష్టంగా 10 మంది సభ్యులు ఉండవచ్చు. ప్రస్తుతం కమిషన్‌లో ఇద్దరు సభ్యుల పదవులు ఖాళీగా ఉన్నాయి. యుపిఎస్సీ ఛైర్మన్‌ను పదవీకాలం ఆరు సంవత్సరాలు.

# యుద్ధ రీతిని సమూలంగా మార్చిన డ్రోన్లు

## దడ పుట్టించే 'డ్రోణా'స్త్రం
## సైనిక సంపదలో కీలకంగా ఈ ఆధునిక వ్యవస్థ
## ఆపరేషన్ సిందూర్ తోసత్తా చాటిన భారత్
## డ్రోన్స్ తయారీలోదిగ్గజ కంపెనీలు నిమగ్నం
## మేము సైతం అంటున్న హైదరాబాద్ సంస్థలు



హైదరాబాద్: రాజుల కాలంలో కత్తులు, బల్లేలతో సైనికులు రణక్షేత్రంలో పోరాడారు. తరవాత.. యుద్ధ భూమిలో తుపాకులు, బాంబుల మోత మోగింది. సాంకేతికత అందుబాటులోకి వచ్చాక మానవ రహిత విమానాలు, క్షిపణులతో విరుచుకుపడుతున్నారు. ఇప్పుడు.. ఏకంగా వేల మైళ్ల దూరం నుంచే శత్రుదేశంపై దాడులు చేస్తూ మారణహోమం సృష్టిస్తున్నారు. ఇజ్రాయెల్-హమాస్, రష్యా-ఉక్రెయిన్.. తాజాగా భారత్-పాక్... యుద్ధం ఏదైనా.. డ్రోన్స్ (మానవరహిత వైమానిక వాహనాలు (యూఏవీ)) ఇప్పుడు సైనిక సంపదలో అత్యంత కీలకంగా మారాయి. పెళ్లిళ్ల వంటి వేడుకల్లో ఫొటోలూ, వీడియోలూ తీసే డ్రోన్స్ మాత్రమే చాలా మందికి సుపరిచితం. కానీ, డ్రోన్స్ అంటే అంతకుమించి. డ్రోన్లు అధునాతన ఆయుధాలు. ఎవ్వరూ ప్రాణాలను పణంగా పెట్టకుండానే కచ్చితమైన దాడులు చేయడం, వేగంగా మోహరించే సామర్థ్యం వీటి సొంతం. క్షిపణులతో పోలిస్తే వీటి అభివృద్ధికి అయ్యే వ్యయమూ తక్కువే.

### మన దేశంలో డ్రోన్ల వాడకం..

1999లో కార్గిల్ యుద్ధంలో మన సైన్యం తొలిసారి యూఏవీలను వినియోగించింది. ఆ తర్వాత ఇండియా అధికారికంగా వీటి కొనుగోలు మొదలు పెట్టింది. ప్రస్తుతం మన సైన్యం వద్ద ఇజ్రాయిల్ నుంచి దిగుమతి చేసుకున్న సెర్చర్ ఎంకే%-%2 టాక్టికల్ డ్రోన్స్, హెరాన్‌మీడియం ఆల్టిట్యూడ్ లాంగ్ ఎండ్యూరెన్స్ (ఎంఏఎల్ఈ), హార్పీ యాంటీ రాడార్ డ్రోన్లు ఉన్నాయి. హార్పీ అనేది ఆత్మాహుతి డ్రోన్(లాహోర్ వైమానిక రక్షణ వ్యవస్థను కూల్చివేసే క్రమంలో దీన్ని వినియోగించారు). వీటితో పాటు హరోప్ లాయిటరింగ్ అటాక్ డ్రోన్స్ కూడా ఉన్నాయి. రాడార్ సైట్లు, వాహనాలే లక్ష్యంగా మందుగుండుతో ఢీకొట్టి సర్వనాశనం చేయడం దీని స్పెషాలిటీ. దీంతో పాటు అధిక మన్నిక, పేలోడ్ సామర్థ్యం కలిగిన ఇజ్రాయిల్ ఎంఏఎల్ఈ డ్రోన్'హెరాన్‌టీపీ/మార్క్ 2'కూడా మన దగ్గర ఉంది.

### మొదటి ప్రపంచ యుద్ధంలో..

మొదటి ప్రపంచ యుద్ధంలో బ్రిటన్, అమెరికా రెండూ తొలిసారిగా యూఏవీతో ప్రయోగాలు చేశాయి. 1950-60లలో శత్రు భూభాగంపై గూఢచర్యం చేయడానికి యూఎస్ చిన్న రిమోట్ కంట్రోల్డ్ డ్రోన్లు ఉపయోగించింది. వియత్నాం యుద్ధంలో నిఘా యూఏవీలు తొలిసారిగా మోహరించారు. 2000వ సంవత్సరంలో అమెరికా హెల్‌ఫైర్ క్షిపణులతో కూడిన ప్రిడేటర్ డ్రోన్‌ను రూపొందించింది. ఇక్కడి నుంచే సైనిక ఆయుధ భాండాగారంలోపెనుమార్పులు వచ్చాయి. మగ తేనెటీగను ఇంగ్లీషులో డ్రోన్ అంటారు. శ్రామిక తేనెటీగలకన్నాఇవి పెద్దగానే ఉంటాయి. కానీ తేనెనూ సంపాదించలేవు. తమను తామూపోషించుకోలేవు. ఒక్కమాటలో చెప్పాలంటే.. ఇవి చేసే పని ఏమీ ఉండదు. కానీ, ఆడ తేనెటీగ కోసం వెతుకుతూ ఎగిరి, దాన్ని కలిశాక పడిపోతుంది. డ్రోన్ మాత్రం అలాకాదు.. చూసి రమ్మంటే కాల్చి వస్తుంది.

### హైదరాబాద్ నుంచి..

రక్షణ రంగ ఉత్పత్తుల తయారీలో హైదరాబాద్ ప్రపంచ పటంలో ఇప్పటికే నిలిచింది. డిఫెన్స్ డ్రోన్‌విభాగంలోనూ ఇదే బాటలో పయనిస్తోంది. టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్.. భారత రక్షణ శాఖ కోసం ఏఎల్ఎస్-250 యూఏవీలను ఉత్పత్తి చేస్తోంది. అదానీ-ఎల్బిట్ అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ ఇండియా.. హెర్మీస్ 900 యూఏవీలను తయారు చేస్తోంది. రక్షణ రంగానికి కావాల్సిన కీలక యంత్ర, పరికరాల తయారీలో ఏడు దశాబ్దాల చరిత్ర కలిగిన హైదరాబాద్ సంస్థ ఎస్ఈసీ ఇండస్ట్రీస్‌కు చెందిన ట్రిన్నోవేట్ సినర్జీ టెక్నాలజీస్ చిన్న యూఏవీలు, హైబ్రిడ్ డ్రోన్స్ సరఫరా చేస్తోంది. ఆయుధాలను మోసే యూఏవీలను ఇండియన్ ఆర్మీకి అందిస్తోంది. జెన్ టెక్నాలజీస్ చిన్న యూఏవీలను భారత రక్షణ విభాగాలకు సరఫరా చేస్తోంది. ఎస్ఈసీ డీఆర్‌వీఏఎన్ఇన్నోవెన్షన్స్.. మిలిటరీ టెస్టింగ్ కోసం టార్గెట్ డ్రోన్లనుబీ శిక్షణ, మదింపు కోసం శత్రు డ్రోన్లను అనుకరించే యూఏవీలను ఆఫర్ చేస్తోంది. మారుత్ డ్రోన్స్ రక్షణ, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా డ్రోన్లను అభివృద్ధి చేస్తోంది. టీ-హబ్, టీ-వర్క్స్ కేంద్రంగా కొన్ని స్టార్టప్స్ ఈ సెగ్మెంట్లోకి రానున్నాయి. భారత్ ఎలక్ట్రికల్స్ - హిందూస్థాన్ ఏరోనాటిక్స్ తయారీ భాగస్వాములుగా డీఆర్‌డీఓ రుస్తోమ్ - 2 డ్రోన్స్ అభివృద్ధి చేసింది. దక్ష యూఏవీ, ఐడియా ఫోర్జ్ వంటివి కూడా హైదరాబాద్ నుంచి కార్యకలాపాలు సాగిస్తున్నాయి.

### 2030 నాటికి రూ.34,860 కోట్లకు..

డ్రోన్స్, యూఏవీల తయారీలో 75% వరకు విడి భాగాలు దేశీయంగా ఉత్పత్తి అయినవే. కొన్ని నెలల్లో ఇది 100 శాతానికి చేరడం ఖాయమని పరిశ్రమ ఆశాభావం వ్యక్తం చేస్తోంది. డిఫెన్స్ డ్రోన్‌కంపెనీలు పరిశోధన, అభివృద్ధి, తయారీకి ఇప్పటికే రూ.2,000 కోట్ల పెట్టుబడి పెట్టాయి. పరిశ్రమకు రూ.1,000 కోట్ల ప్రోత్సాహకాలను ప్రభుత్వం త్వరలో ప్రకటించే అవకాశం ఉందని సమాచారం. భారత సైనిక డ్రోన్ మార్కెట్ 2024లో రూ.13,040 కోట్లు. 2030 నాటికి ఇది రూ.34,860 కోట్లకు చేరుతుందని గ్రాండ్ వ్యూ రిసర్చ్ అంచనా.

# ఇంజనీరింగ్ కోర్ గ్రూపులకు ఆదరణ తగ్గడంపై సర్కారు దృష్టి

## త్వరలో కాలేజీల నిర్వాహకులు, అధికారులతో కమిటీ ఏర్పాటుకు నిర్ణయం
## ఈ ఏడాది నుంచి కోర్ గ్రూపుల సిలబస్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్
## అంతా సీఎస్ఈ వైపే మొగ్గుతుండటంతో తగ్గుతున్న కోర్ సీట్లు, చేరికలు



హైదరాబాద్: ఇంజనీరింగ్‌లో కోర్ గ్రూపులకు రానురాను ఆదరణ తగ్గుతోంది. కంప్యూటర్ సీట్లకు డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో.. ప్రతి ఏటా కోర్ గ్రూపుల్లో సీట్లు మిగిలిపోతున్నాయి. దీంతో కాలేజీలు వాటిని తగ్గించుకునేందుకే మొగ్గుచూపుతున్నాయి. గత ఏడాది వందకు పైగా కాలేజీలు సివిల్, మెకానికల్, ఈఈఈ బ్రాంచీల్లో సీట్లు తగ్గించాలని దరఖాస్తులు పెట్టుకున్నాయి. ఈ ఏడాది కూడా పరిస్థితి ఇలాగే ఉంది. దీనిపై ఇటీవల ప్రభుత్వ ఉన్నతాధికారులు సమీక్షించారు. ఉన్నత విద్యాశాఖ నుంచి సమగ్ర నివేదిక కోరారు. ఇంజనీరింగ్ విద్యలో సమతుల్యత అవసరమని భావిస్తున్న అధికారులు.. కోర్ గ్రూపులను కాపాడేందుకు త్వరలో ప్రభుత్వ, ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల నిర్వాహకులు, ఉన్నత విద్యా మండలి అధికారులతో కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ విద్యా సంవత్సరం నుంచే దిద్దుబాటు చర్యలపై దృష్టి పెట్టాలనే ఆలోచనలో ఉన్నారు.

### తగ్గుతున్న చేరికలు

సివిల్, మెకానికల్, ఎలక్ట్రానిక్స్, ఈఈఈ కోర్సుల్లో 2019లో 43,532 సీట్లు ఉంటే 25,823 సీట్లు భర్తీ అయ్యాయి. 2024 సంవత్సరానికి వచ్చేసరికి అంటే ఐదేళ్లలో సీట్లు 25,597కు పడిపోయాయి. 19,739 చేరికలు మాత్రమే నమోదయ్యాయి. మరోవైపు కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్‌లో గడచిన ఆరేళ్ళలో 280 శాతం మేర ప్రవేశాలు పెరిగాయి. సీట్లు కూడా భారీగానే పెరిగాయి. 2019లో కన్వీనర్ కోటా కింద 22,033 సీఎస్ఈ సీట్లు ఉంటే 20,311 సీట్లు భర్తీ అయ్యాయి. 2024లో సీట్లు 61,587కు పెరగగా ఏకంగా 59,485 సీట్లు భర్తీ అయ్యాయి.

### స్లైడింగ్‌లో మార్పుతోనూ కోర్‌కు నష్టం

ఇంజనీరింగ్ ప్రవేశాలకు సంబంధించి గత ఏడాది ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం కూడా కోర్ గ్రూపులను మరింత దెబ్బతీసిందని నిపుణులు అంటున్నారు. కన్వీనర్ కోటా కింద ఏదైనా కాలేజీలో ప్రవేశాలు పొందిన విద్యార్థులు ఆఖరి సమయంలో ఐఐటీ, ఎన్ఐటీల్లోనో, డీమ్డ్, ఇతర రాష్ట్రాల కాలేజీల్లోనో చేరుతుంటారు. దీంతో ఖాళీ అయ్యే సీట్లను కాలేజీలు బయటి విద్యార్థులతో భర్తీ చేసేవి. అయితే గత ఏడాది స్లైడింగ్ విధానాన్ని నిర్వహించిన సాంకేతిక విద్య విభాగం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని కాలేజీలకు కలిపి స్లైడింగ్ నిర్వహించ లేదు. ఏ కాలేజీకి ఆ కాలేజీలో మాత్రమే స్లైడింగ్‌కు అవకాశం ఇచ్చింది. ఇది కోర్ గ్రూపులను మరింత దెబ్బతీసింది. 40 వేల ర్యాంకు వచ్చిన వ్యక్తి ఒక కాలేజీలో సివిల్ గ్రూపులో సీటు పొందితే, స్లైడింగ్‌లో ఆ వ్యక్తి సీఎస్ఈ సీటు తెచ్చుకున్నాడు. కానీ 10 వేల లోపు ర్యాంకు వచ్చిన విద్యార్థి కంప్యూటర్ కోర్సు మాత్రమే కోరుకున్నా, ఆ కాలేజీలో బ్రాంచి లేకపోవడం వల్ల సీటు పొందలేని స్థితి ఏర్పడింది. ఈ విధంగా గత ఏడాది దాదాపు 5,500 మంది విద్యార్థులు నష్టపోయినట్టు అధికారులు చెబుతున్నారు. గతంలో కోర్ బ్రాంచీల్లో చేరిన వారిని అలాగే ఉంచి, కొత్తవారికి అవకాశం ఇచ్చేవారు. దీనివల్ల కోర్ గ్రూపులో చేరినవారు అలాగే ఉండేవారు. దీనిపై పలువురు విద్యావేత్తల నుంచి వచ్చిన సూచనలను పరిగణనలోకి తీసుకోవాలని ఉన్నత విద్య అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. మరోవైపు ఇటీవలి కాలంలో కోర్ గ్రూపుల సిలబస్‌లో మార్పులు చేస్తున్నారు. ఈ ఏడాది నుంచి కొత్తగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ చాప్టర్లను కూడా చేరుస్తున్నారు. దీనివల్ల కోర్‌కు ఆదరణ పెరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

# వెనక్కి తగ్గిన అమెరికా - చైనా



వేలంపాట తరహాలో అమెరికా, చైనాలు ఒకరిపై ఒకరు సుంకాలు పెంచుకుంటూ పోయిన వైనంతో బెంబేలెత్తిన ప్రపంచ మార్కెట్లూ, ఆర్థిక వ్యవస్థలూ నేల చూపులు చూస్తున్న వేళ జెనీవా నుంచి సోమవారం ఒక చల్లని కబురు వినబడింది. ఆర్థికంగా ప్రపంచంలోనే ఒకటి, రెండు స్థానాల్లో ఉన్న ఇరు దేశాలూ ప్రస్తుతానికి వెనక్కి తగ్గాలని నిర్ణయించుకున్నాయన్నదే దాని సారాంశం. ఇది బుధవారం నుంచి అమల్లోకొచ్చి తొంభై రోజులపాటు... అంటే మూణ్ణెల్లపాటు అమల్లో వుంటుందనీ, రెండు దేశాల ప్రతినిధులతో ఏర్పడిన సలహా యంత్రాంగం ద్వైపాక్షిక ఆర్థిక, వాణిజ్య సమస్యలను చర్చించి, వాటి పరిష్కారానికి కృషి చేస్తుందనీ ఉమ్మడి ప్రకటన వివరిస్తోంది. ఈ సలహా యంత్రాంగంలో చైనా తరఫున ఆ దేశ ఉపప్రధాని హెూ లిఫాంగ్ , అమెరికా తరఫున ఆర్థికమంత్రి స్కాట్ బిసెంట్, వాణిజ్య ప్రతినిధి జెమిసన్ గ్రీయర్‌లుంటారు. మూర?త్వంలో ఎవరికెవరూ తీసిపోని ఈ రెండు పక్షాలూ చివరికేం చేస్తాయన్నది ఇంకా చూడాల్సేవున్నా ఇప్పటికైతే ఒక ముప్పు తాత్కాలికంగానైనా ఉపశమించిందని సంతోషించక తప్పదు. మొన్న జనవరిలో అమెరికాలో అధికార పగ్గాలు చేపట్టినప్పటి నుంచీ ప్రపంచాన్ని హడలెత్తిస్తూ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తీసుకున్న వరస నిర్ణయాల్లో ఈ సుంకాల పెంపు వ్యవహారం అతి పెద్దది. గత నెల 2 నుంచి అమల్లోకొచ్చిన ఈ పెంపు చైనా మినహా వేరే దేశాలపై తాత్కాలికంగా ఆపేస్తున్నట్టు ట్రంప్ ఆ వెంటనే ప్రకటించారు. కానీ కోడెల పోట్లాటల మధ్య లేగల కాళ్లు విరిగినట్టు అమెరికా-చైనా సుంకాల యుద్ధంతో ప్రపంచమంతటికీ సమస్యలు తలెత్తాయి. తాజా ఒప్పందం పర్యవసానంగా అమెరికా విధించిన 145 శాతం సుంకాలు కాస్తా 30 శాతానికి తగ్గుతాయి. అలాగే అమెరికా దిగుమతులపై చైనా విధించిన 125 శాతం సుంకాలు 10 శాతానికి దిగొస్తాయి. ఈ వారం ఆఖరులోగా తాను చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌తో చర్చిస్తానని ట్రంప్ చెప్పటం కూడా సంతోషించదగ్గది. చైనాతో సుంకాల విషయమై చర్చలు సాగుతున్నాయని ఆ మధ్య ట్రంప్ పదే పదే ప్రకటించగా చైనా ఖండించింది. చివరకు స్విట్జర్లాండ్‌లోని జెనీవాలో చర్చలు సాకారమయ్యాయి. చైనాను దెబ్బతీసే ఉద్దేశం తమకు మొదణ్ణించీ లేదని ట్రంప్ ప్రకటించారు. ఇది స్వాగతించ దగ్గదే అయినా బడాయి మాటనే చెప్పాలి. ఎందుకంటే ఆ దేశాన్ని దెబ్బతీయటం సంగతలా వుంచి అమెరికాలోని తయారీరంగ పరిశ్రమలు ముడిసరుకులు దొరక్క ఇబ్బందులుపడుతూ దివాలా దశకు చేరాయి. ఉద్యోగాలకు కోతబెట్టాయి. వినియోగదారులు సైతం ఉత్పత్తులు అందుబాటులో లేకపోవటంతో పాటు, లభ్యమైన సరుకు ధర ఆకాశాన్నంటడంతో దిక్కుతోచని స్థితిలో పడ్డారు. ఉద్యోగాలు కోల్పోయి సతమతమవుతుంటే సరుకును రెట్టింపు, అంతకన్నా ఎక్కువ ధరకు కొనుగోలు చేయాల్సి రావటం వారిని కుంగదీసింది. చైనాలోనూ పరిస్థితి ఏమంత సజావుగా లేదు. అనేక కంపెనీలు మూతబడ్డాయి. కొన్ని సంస్థలు ఆగ్నేయాసియా దేశాలకు ఎగుమతులపై దృష్టి సారించాయి. ట్రంప్ అధికారంలోకొస్తూనే దేశంలో యువత ప్రాణాలు తీస్తున్న మత్తు పదార్థం ఫెంటానిల్ విచ్చలవిడిగా దొరకటంలో చైనా పాత్రవుందని ఆరోపిస్తూ ఆ దేశం నుంచి వచ్చే దిగుమతులపై 20 శాతం అదనంగా సుంకాలు పెంచారు. గత నెల 2 నుంచి దానికి మరో 34 శాతం జోడించారు. ఇలా తమ నుంచి వెళ్లిన సరుకులపై 54 శాతం సుంకాలు విధించటాన్ని జీర్ణించుకోలేని చైనా దానికి ప్రతీ కారంగా అమెరికా దిగుమతులపై 34 శాతం మేర అదనపు సుంకాలు విధించింది. ఇక అక్కడి నుంచి ఇద్దరిమధ్యా 'చంపుడు పందెం' మొదలైంది. నిజానికి ట్రంప్‌కు ముందు ఫెంటానిల్‌తో చైనాకు లంకె పెట్టినవారెవరూ లేరు. అధ్యక్ష ఎన్నికల్లో రాజకీయ ప్రయోజనాలను ఆశించి ఆయన దాన్ని ఎక్కువచేసి చూపారు. మొత్తానికి అమెరికా 145 శాతం, చైనా 125 శాతం సుంకాల దగ్గర ఆగాయి. ఇప్పుడు కుదిరిన ఒప్పందం పర్యవసానంగా గంపగుత్తగా అన్ని రకాల సరుకులపైనా సుంకాలు తగ్గిపోవు. చైనా సరుకులపై అమెరికా విధించిన 30 శాతం సుంకాలు కొనసాగుతాయి. అలాగే విద్యుత్ వాహనాలు, ఉక్కు, అల్యూమినియం దిగుమతులపై ఇంతకన్నా ఎక్కువగానే సుంకాలున్నాయి. అవన్నీ గత కొన్ని సంవత్సరాల్లో విధించినవి కనుక ఈ ఒప్పందం వాటి జోలికిపోదు. అవతలిపక్షం నుంచి ఎలాంటి రాయితీలూ పొందకుండా, తమకనుకూలమైన ముగింపు వైపుగా చర్యలేమీ కనబడకుండా ఒప్పందానికి రావటం బలహీనతను సూచిస్తుంది తప్ప బలాన్ని కాదు. ప్రస్తుత ఒప్పందం వ్యూహాత్మకమైనదని చెప్పుకున్నా, మున్ముందు దేశానికేదో ఒరుగుతుందని అంటున్నా... అధిక సుంకాల మోత నుంచి వెనక్కి తగ్గమని ట్రంప్‌పై దేశంలో అన్నివైపుల నుంచీ ఒత్తిళ్లు వచ్చాయన్నది వాస్తవం. నిరుటి గణాంకాలు గమనిస్తే రెండు దేశాలూ వాణిజ్య పరంగా పరస్పరం ఆధారపడినవేనని తెలుస్తుంది. చైనా ఎగుమతుల్లో అమెరికా వాటా 12.9 శాతం. అలాగే అమెరికా మొత్తం ఎగుమతుల్లో చైనా వాటా 14.8 శాతం. కెనడా, మెక్సికోల తర్వాత స్థానం చైనాదే. అధిక సుంకాల యుద్ధం చివరకు ప్రపంచ ఆర్థికాభివృద్ధిని మందగింపజేస్తుందని, ఉత్పత్తుల కొరతను సృష్టించి ద్రవ్యోల్బణానికి దారితీస్తుందని... ఇదంతా చిట్టచివరకు అమెరికాను మాంద్యం ఊబిలోకి నెడుతుందని నిపుణులు మొదణ్ణించీ హెచ్చరిస్తూనే ఉన్నారు. సర్వజ్ఞుణ్ణని భావించేవారికి చెప్పటానికి ప్రయత్నించటం వృథా ప్రయాస. ఏదైనా అనుభవంలోకొస్తే తప్ప తత్వం బోధపడదు. మొత్తానికి ఈ చర్చల వల్ల ఇప్పటికైతే అర్థవంతమైన పరిష్కారం లభించలేదు. మున్ముందు ఏమవుతుందన్నది రెండు దేశాల విజ్ఞతకూ పరీక్ష.